స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 92 | గురువారం, 20 ఆగస్టు, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 92 | THURSDAY, AUGUST 20, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## ఖానాపురం పండ్ల మార్కెట్ యార్డుకు రూ.17.72 కోట్లు

31 అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు

మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో నిధుల మంజూరు

రోడ్లపై పండ్ల విక్రయాలకు త్వరలో తెర

2 లో..



### ప్రతి రైతుకు సకాలంలో

# రుణాలు అందాలి

• బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి • రుణంతోపాటు ఆదాయమూ పెరగాలి • క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా బ్యాంకింగ్ వ్యూహాలు • తెలంగాణ రైజింగ్ 2047కు అనుగుణంగా బ్యాంకింగ్ • రోడ్‌మ్యాప్ రూపొందించాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య):

రైతులు రుణం కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, అవసరమైన సమయంలో బ్యాంకింగ్ వ్యవస్థే రైతుల వద్దకు వెళ్లాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రుణం ఇవ్వడంతోనే బ్యాంకుల బాధ్యత పూర్తికాదని, ఆ రుణం రైతు ఆదాయాన్ని పెంచేలా ఉండాలని సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల



ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకింగ్, ఆర్థిక రంగాలు కీలక భాగస్వాములు కావాలని అన్నారు. కేవలం ప్రభుత్వ వ్యయంతో ఈ లక్ష్యాలను సాధించడం సాధ్యం కాదని, భారీ ప్రైవేటు పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న నిధుల విధానాలు అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 కేవలం ఒక దార్శనిక పత్రం కాదని, ప్రజలతో ప్రభుత్వం చేసుకున్న అభివృద్ధి ఒప్పందమని అన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకింగ్ రంగం కూడా తన వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకులు నిర్దేశిత రుణ లక్ష్యాలను చేరుకున్నాయా లేదా అన్నదానికంటే.. ఆ రుణాలతో ఎన్ని పరిశ్రమలు ఏర్పడ్డాయి, ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి, వ్యవసాయ మిగతా 2లో..

# వివాదాలను పరిష్కరించుకుందాం!

• మహాబలిపురంలో నేడు దక్షిణాది రాష్ట్రాల సిఎంల భేటీ • చెన్నై చేరుకున్న పలువురు ముఖ్యమంత్రులు • కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన నిర్వహణ • కీలక అంశాలు ప్రస్తావించనున్న ఏపీ సీఎం చంద్రబాబు.. • విమానాశ్రయంలో చంద్రబాబుకు ఘన స్వాగతం
• ఫొటో జర్నలిస్టుగా సీఎం
• ఫొటోగ్రఫీ డే సందర్భంగా కెమెరా చేతబట్టి.. ఫొటో తీసిన సీఎం



అమరావతి/చెన్నై, (వార్త వేదిక సూర్య):

దక్షిణ భారత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సమస్యలు, వివాదాల పరిష్కారం లక్ష్యంగా దక్షిణ ప్రాంతీయ మండలి (సదరన్ జోన్సల్ కౌన్సిల్) 31వ సమావేశం గురువారం తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీప కోవలం వద్ద జరుగనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళం, కర్ణాటక రాష్ట్రాలు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్ వంటి కేంద్రపాలిత ప్రాంతాలున్న ఈ మండలికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చైర్మన్‌గా, ప్రస్తుత సమావేశానికి ఆతిథ్యమిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. అమిత్‌షా అధ్యక్షతన ఓ హోటల్లో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. సమావేశంలో పాల్గొనేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సహా పలువురు దక్షిణాది రాష్ట్రాల సీఎంలు బుధవారం సాయంత్రమే చెన్నైకి చేరుకున్నారు. దక్షిణభారత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సమస్యలు, వివాదాలను పరిష్కరించడానికి ఈ మండలి ఒక అద్భుతమైన వేదికగా పని చేస్తుందని కేంద్రప్రభుత్వం పేర్కొంది. తమిళనాడు-కేరళ, తమిళనాడు-కర్ణాటకు, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య నదీ జలాల పంపిణీ వివాదాలు నెలకొన్న ప్రస్తుత మిగతా 2లో..

## త్యాగం మీది.. అండ మాది

• వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం • నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన సీఎం చంద్రబాబు • ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు

7 లో..

## ప్రిన్సిపాల్‌ను చంపింది విద్యార్థులే

• జల్సాల అలవాటుతో ఆమె ఇంట్లో దొంగతనానికి ప్లాన్ • రూపారెడ్డి గుర్తుపట్టడంతో కిచెన్‌లో కత్తితో పొడిచి హత్య • పర్సులో డబ్బు, సెల్‌ఫోన్ తీసుకుని పరార్ • వివిధ కోణాల్లో పరిశీలించి ఇద్దరు విద్యార్థుల పట్టివేత • హత్యకేసును వివరించిన ఎస్పీ శరత్ చంద్ర



2 లో..



# రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, ఉపాధి విస్తరణ

• పెద్దపల్లి జిల్లాలో రూ.1,700 కోట్ల రహదారి పనులు • రూ.219.67 కోట్ల పనులకు శంకుస్థాపన • ఏడాదిలోపు పెద్దపల్లి బైపాస్ పూర్తి చేస్తాం • సుల్తానాబాద్ బైపాస్‌కు కృషి: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య):



రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, వ్యాపారాలు విస్తరించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గరేపల్లిలో రూ.219.67 కోట్ల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ విధానం, సాధారణ రహదారి అభివృద్ధి పనులకు బుధవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో ప్రభుత్వం 40 శాతం, కాంట్రాక్టర్ 60 శాతం నిధులు సమకూర్చే విధంగా పనులు చేపడుతున్నామని కోమటిరెడ్డి తెలిపారు. శంకుస్థాపన చేసిన పనులను రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని, వారం మిగతా 2లో..



### సినిమా థియేటర్లలో ధరలపై

# ప్రభుత్వం ఉత్తర్వులు

• నాన్ ఏసీ, ఏసీ, స్పెషల్, మల్టీప్లెక్స్ థియేటర్లలో ధరలు ఖరారు
• రూ.100 కోట్లు దాటితే సూపర్ హై బడ్జెట్ సినిమాగా గుర్తింపు
• ఈ సినిమాలకు తొలి 10రోజులు టికెట్ల రేట్లు పెంచుకొనే చాన్స్ • సినీ కార్మికుల నిధికి కోటి విరాళం ఇచ్చే సినిమాలకే ధరల పెంపు • రోజుకు 5 షోలకు అవకాశం.. అందులో కనీసం ఒక షో చిన్న సినిమా ఉండాలి

2 లో..



# హుస్నాబాద్‌లో పల్లె పల్లెకు ప్రజాపాలన

• 173 గ్రామాల్లో పర్యటిస్తా.. సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తా • దుద్దెనపల్లి, ఏక్లాస్‌పూర్‌లో పల్లె దవాఖానలు ప్రారంభం • అభివృద్ధి, సంక్షేమంపై గ్రామాల వారీగా సమీక్ష: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ ఆగస్టు 19 (వార్త వేదిక సూర్య):

ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో 'పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజాపాలన' కార్యక్రమం ద్వారా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటామని తెలిపారు. మిగతా 2లో..

## డిపెండెంట్ ఉద్యోగాలకు ప్రతి నెలా మెడికల్ బోర్డు పెట్టాలి

• అన్‌ఫిట్‌కు దరఖాస్తు చేసుకున్న 2 వేల మందికి న్యాయం చేయాలి • వారసులకు ఉద్యోగాలు వచ్చే వరకు పోరాడుతాం: కల్వకుంట్ల కవిత • అలియాస్ పేర్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి

2 లో..



### వైఎస్ఆర్ రాష్ట్ర మ్యూజియానికి

# పూర్వ వైభవం



• క్రీ.పూ. 2500 ఏళ్ల నాటి ఈజిప్షియన్ మమ్మీ సంరక్షణకు చర్యలు • మ్యూజియం పునరుద్ధరణకు త్వరలో నిధులు • దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక ప్రణాళికలు • వారంలోగా పనుల అంచనాలు సమర్పించాలి: మంత్రి జూపల్లి

హైదరాబాద్, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య):

చారిత్రక, పురావస్తు సంపదకు నిలయమైన డా. వైఎస్ఆర్ రాష్ట్ర మ్యూజియానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని మ్యూజియాన్ని బుధవారం సందర్శించిన మంత్రి.. వివిధ మిగతా 2లో..

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 92
గురువారం
20 ఆగస్టు, 2026

## హుస్నాబాద్‌లో పల్లె పల్లెకు ప్రజాపాలన

(మొదటి పేజీ తరువాయి)

సైదాపూర్ మండలం దుద్దెనపల్లి, ఏక్లాస్‌పూర్, సోమారం గ్రామాల్లో బుధవారం పర్యటించిన మంత్రి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దుద్దెనపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను మంత్రి ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలో ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశమై గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. పశువులకు ఉచిత గర్భకోశ నివారణ మందుల పంపిణీ శిబిరాన్ని కూడా ప్రారంభించారు. ప్రజా పాలనలో భాగంగా దుద్దెనపల్లి గ్రామంలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. సైదాపూర్ మండలంలో తొలి దశలో 486 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 370 పూర్తయ్యాయని, మరో 170 నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. దుద్దెనపల్లిలో 32 ఇళ్లు మంజూరు కాగా 29 పూర్తయ్యాయని చెప్పారు. గ్రామంలోని 49 స్వయం సహాయక సంఘాలకు రూ.20.86 లక్షలు, 50 సంఘాలకు బ్యాంకు అనుసంధానం కింద రూ.50 లక్షలు అందించినట్లు తెలిపారు. దుద్దెనపల్లిలో 982 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.3.56 కోట్లు, 285 మంది రైతులకు రుణమాఫీ కింద రూ.2.49 కోట్లు, 95 మంది రైతులకు సన్న వడ్ల ప్రోత్సాహకంగా రూ.38 లక్షలు అందినట్లు మంత్రి వివరించారు. 136 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయగా, 24 భూ భారతి సమస్యలను పరిష్కరించామని, 29 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందించామని తెలిపారు. ఏక్లాస్‌పూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను కూడా మంత్రి ప్రారంభించారు. గ్రామంలో 269 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 356 కుటుంబాలకు రూ.500 గ్యాస్ సబ్సిడీ ప్రయోజనం అందుతోందన్నారు. 1,202 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.5.50 కోట్లు, 591 మంది రైతులకు రూ.4.65 కోట్ల రుణమాఫీ, ఐదుగురు రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల రైతు బీమా అందినట్లు చెప్పారు. గ్రామంలో 99 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, 296 మందికి పింఛన్లు అందుతున్నాయని తెలిపారు. అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, హెచ్‌ఐవీ, తలసేమియా తదితర బాధితులు కొత్త పింఛన్ల కోసం ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## డిపెండెంట్ ఉద్యోగాల కోసం ప్రతి నెలా మెడికల్ బోర్డు పెట్టాలి

హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య):

సింగరేణి కార్మికుల డిపెండెంట్ ఉద్యోగాల కోసం అన్‌ఫిట్‌కు దరఖాస్తు చేసుకున్న సుమారు 2వేల మందికి న్యాయం జరిగే వరకు ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఒక్క నెల మాత్రమే మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి, ఆ తర్వాత కొనసాగించకపోవడం సరికాదన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరి ప్రక్రియ పూర్తయ్యే వరకు బోర్డును నిరంతరం నిర్వహించాలని హెచ్‌ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన తరఫున డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని గతంలో చేసిన హెచ్చరికలకు ప్రభుత్వం స్పందించిందని కవిత తెలిపారు. అయితే గత నెలలో మాత్రమే బోర్డు ఏర్పాటు చేసి, ఈ నెలలో నిర్వహించకపోవడం వల్ల బాధితులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే హెచ్చరించామని, దరఖాస్తుదారులందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలియాస్ పేర్ల కారణంగా ఉద్యోగాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న యువకుల సమస్యను కూడా ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కవిత కోరారు. ఈ సమస్య పరిష్కారం కోసం యువకులు నిరాహార దీక్ష చేపడితే, వారి దీక్షను విరమింపజేయడం కాకుండా ప్రభుత్వంతో చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. అలియాస్ పేర్ల సమస్యపై ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న కూనంనేని సాంబశివరావు చొరవ తీసుకోవాలని ఆమె అన్నారు. నిరాహార దీక్ష చేస్తున్న యువకులకు ఏ హామీ ఇచ్చారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వారికి రావాల్సిన ఉద్యోగాలు, హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలియాస్ ఉద్యోగాలకు సంబంధించి గతంలో వివిధ కార్మిక సంఘాలు అఫిడవిట్లు సమర్పించినప్పటికీ, సంబంధిత అంశంలో తగిన చర్యలు తీసుకోలేదని కవిత ఆరోపించారు. ప్రస్తుతం నిరాహార దీక్ష చేస్తున్న యువకుల దీక్షను విరమింపజేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని పేర్కొన్నారు. ఈ విషయంలో ద్వంద్వ వైఖరిని అవలంబించవద్దని హెచ్చరించారు. అలియాస్ పేర్లతో ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్న యువకులు చేస్తున్న పోరాటానికి హెచ్‌ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన మద్దతు ఇస్తాయని కవిత ప్రకటించారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం అన్‌ఫిట్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికీ న్యాయం జరిగే వరకు ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రతి రైతుకూ సకాలంలో రుణం

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పాదకత ఎంత పెరిగింది, గ్రామీణ ఆదాయం ఎంత మెరుగుపడింది, ఎంత ప్రైవేటు పెట్టుబడి సమకూరిందనే అంశాలే బ్యాంకింగ్ పనితీరుకు కొలమానాలుగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ, గ్రామీణ రంగాలు పునాదులని భట్టి విక్రమార్క అన్నారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, ఆయిల్‌పామ్, ఆహార శుద్ధి తదితర అనుబంధ రంగాలను కూడా అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని కోరారు. రైతు రుణం తిరిగి చెల్లించలేకపోతే కేవలం వసూలు చర్యలకే పరిమితం కాకుండా.. రైతు ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించాలని సూచించారు. ఉత్పాదకత, మార్కెట్ సదుపాయాలు, కోత అనంతర వసతులు, పని మూలధనం వంటి అంశాలను రుణ వ్యూహంలో భాగం చేయాలని అన్నారు. 2026 జూన్ నాటికి బ్యాంకులు వ్యవసాయ రంగానికి రూ.52,337 కోట్ల రుణాలు అందించడం అభినందనీయమని, అయితే రుణం సకాలంలో అందడం మరింత ముఖ్యమని చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో కీలకమని భట్టి పేర్కొన్నారు. రుణం మంజూరు కావడమే కాకుండా అవసరమైన సమయంలో వ్యాపారుల చేతికి నిధులు చేరాలని అన్నారు. రుణ దరఖాస్తు, మంజూరు, పంపిణీకి స్పష్టమైన కాలపరిమితి ఉండాలని సూచించారు. సూక్ష్మ, చిన్న సంస్థల కోసం రుణ హామీ పథకం కింద ఈ త్రైమాసికంలో రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. తెలంగాణ రైజింగ్ 2047లోని క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా ప్రాంతాల అవసరాల ఆధారంగా ప్రత్యేక రుణ వ్యూహాలు రూపొందించాలని భట్టి సూచించారు. కృత్రిమ మేధస్సు, జీవశాస్త్రాలు, ఔషధ పరిశ్రమలు, అంతరిక్ష రంగం, నూతన సంస్థలకు అధునాతన ఆర్థిక సహకారం అవసరమన్నారు. తయారీ, రవాణా, గిడ్డంగులు, పారిశ్రామిక సముదాయాలు, గృహ నిర్మాణం, మౌలిక వసతులకు ప్యూర్ ప్రాంతాల్లో నిధులు అవసరమని చెప్పారు. రేర్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఆహార శుద్ధి, డెయిరీ, మత్స్య, గ్రామీణ పరిశ్రమలకు సకాలంలో తక్కువ వడ్డీ రుణాలు అందించాలని కోరారు. రాష్ట్రంలో జనధన్ ఖాతాలు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ సుమారు 19.13 లక్షల ఖాతాల్లో నిల్వలు లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. కేవలం ఖాతాలు తెరవడమే ఆర్థిక సమ్మిళితత కాదని, పొదుపు, బీమా, రుణాల వైపు ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లో క్రియాశీలంగా లేని బ్యాంకింగ్ ప్రతినిధులను వెంటనే పనిచేసేలా చేయాలని లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు అందించాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలను కేవలం బ్యాంకు రుణ అనుసంధానానికి పరిమితం చేయకుండా సూక్ష్మ పరిశ్రమలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని కోరారు. యువతకు ఉపాధి ఆధారిత రుణాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహకారం, పచ్చటి–వాతావరణ అనుకూల పెట్టుబడులు, డిజిటల్ ఆర్థిక సేవలు, జిల్లాల మధ్య రుణ వ్యత్యాసాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్ రూపొందించాలని భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. వ్యవసాయం, ఉత్పాదకత ఆధారిత రుణాలు, సూక్ష్మ–చిన్న–మధ్యతరహా పరిశ్రమలు, నూతన సంస్థలు, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ పరిశ్రమలు, యువత ఉపాధి, పచ్చటి ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ ఆర్థిక సమ్మిళితత, మౌలిక వసతులు, కొత్త పరిశ్రమలు, సాంకేతిక రంగాలకు ఇందులో స్పష్టమైన వార్షిక లక్ష్యాలు ఉండాలని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులకు రావాల్సిన నిధుల చెల్లింపులు సకాలంలో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భట్టి హామీ ఇచ్చారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం భాగస్వామిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

## ఖానాపురం పండ్ల మార్కెట్ యార్డుకు రూ.17.72 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య):

ఖమ్మం నగరం నడిబొడ్డున ఖానాపురం హవేలీ పరిధిలో నిర్మాణంలో ఉన్న పండ్ల మార్కెట్ యార్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.17.72 కోట్ల నిధులు మంజూరు చేసింది. మార్కెట్ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఇన్నాళ్లుగా రోడ్ల పక్కన పండ్లు విక్రయిస్తూ ఇబ్బందులు పడుతున్న వ్యాపారులకు ఈ నిర్ణయంతో ఊరట కలగనుంది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరైనట్లు ప్రభుత్వం వెల్లడించింది. 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఖానాపురం సమీకృత పండ్ల మార్కెట్ యార్డు నిర్మాణం, అభివృద్ధికి రూ.1,772 లక్షలు (రూ.17.72 కోట్లు) కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు జారీ చేశారు. మొత్తం 31 అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు, రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు పలు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ బ్లాక్–ఏ, బ్లాక్–బి నిర్మాణానికి రూ.1.02 కోట్ల చొప్పున, కమర్షియల్, ట్రేడర్స్ షాపుల బ్లాక్–ఏ, బ్లాక్–బిలకు రూ.1.53 కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న చిన్న ఆర్చ్ రూఫ్ షెడ్లను ట్రేడర్స్ షాపులుగా మార్చేందుకు రూ.99 లక్షలు, కొత్త కవర్ షెడ్ నిర్మాణానికి రూ.2.22 కోట్లు కేటాయించారు. 60 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఎలక్ట్రానిక్ వెయింగ్ బ్రిడ్జి ఏర్పాటుకు రూ.26 లక్షలు, రైతుల విశ్రాంతి భవనానికి రూ.64 లక్షలు, మరుగుదొడ్ల సముదాయానికి రూ.57 లక్షలు, 90 వేల లీటర్ల సామర్థ్యంతో నీటి నిల్వ ట్యాంకు నిర్మాణానికి రూ.58 లక్షలు మంజూరు చేశారు. మార్కెట్ భద్రతను పెంచేందుకు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.86 లక్షలు కేటాయించారు. యార్డు ప్రాంగణంలో సీసీ ఫ్లోరింగ్, రహదారుల అభివృద్ధికి రూ.3.11 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే ఉన్న పెద్ద ఆర్చ్ రూఫ్ షెడ్లలో వ్యాపారుల దుకాణాల ఏర్పాటుకు రూ.2.49 కోట్లు కేటాయించారు. టవర్ లైట్లు, విద్యుదీకరణ పనులకు కూడా నిధులు మంజూరు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, వాణిజ్య దుకాణాలు, చిన్న ఆర్చ్ రూఫ్ షెడ్లు, కవర్ షెడ్, పెద్ద ఆర్చ్ రూఫ్ షెడ్లలోని దుకాణాలకు ప్రత్యేకంగా విద్యుత్ సదుపాయాలు కల్పించనున్నారు. దీంతో మార్కెట్‌లో వ్యాపార కార్యకలాపాలకు అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడనున్నాయి. మార్కెట్ యార్డు పూర్తయితే ప్రస్తుతం రోడ్లపై పండ్ల విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారులకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఒకే చోట వ్యాపారాలు నిర్వహించుకునే అవకాశం కలగడంతో పాటు కొనుగోలుదారులకు కూడా మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. షాపులు, కవర్ షెడ్లు, సీసీ ఫ్లోరింగ్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వెయింగ్ బ్రిడ్జి వంటి సదుపాయాలతో మార్కెట్ మరింత సౌకర్యవంతంగా మారనుంది. మధ్యలో నిలిచిపోయిన మార్కెట్ యార్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ.17.72 కోట్ల నిధులు మంజూరు చేయడంపై ఖానాపురం పండ్ల వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

## వైఎస్ఆర్ రాష్ట్ర మ్యూజియానికి పూర్వ వైభవం

(మొదటి పేజీ తరువాయి)

గ్యాలరీలను పరిశీలించి, అరుదైన పురావస్తు సంపద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్రాంజ్, బౌద్ధ, శిల్పకళ, ఫిరంగులు, చిత్రకళ తదితర గ్యాలరీలను మంత్రి పరిశీలించారు. మ్యూజియంలోని ప్రధాన ఆకర్షణగా ఉన్న క్రీ.పూ. 2500 ఏళ్ల నాటి ఈజిప్షియన్ మమ్మీని ప్రత్యేకంగా పరిశీలించారు. మమ్మీని భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా అత్యంత భద్రంగా సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. జర్మన్ నిపుణుల నివేదిక ఆధారంగా మమ్మీ సంరక్షణకు రూ.82 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. మ్యూజియం భవనం సంరక్షణతో పాటు పునరుద్ధరణ, పెయింటింగ్, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులను త్వరలో విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని జూపల్లి తెలిపారు. హైదరాబాద్‌కు వచ్చే దేశ, విదేశీ పర్యాటకులు తప్పనిసరిగా సందర్శించే ప్రదేశంగా మ్యూజియాన్ని తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. మ్యూజియంలోని అరుదైన పురావస్తు, చారిత్రక సంపదను విస్తృతంగా ప్రచారంలోకి తీసుకురావడంతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే విలువైన సంపదను పరిరక్షించి ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మ్యూజియం పునరుద్ధరణ, భవన సంరక్షణ, పెయింటింగ్ తదితర పనులకు సంబంధించిన సమగ్ర అంచనాలను రూపొందించి వారంలోగా సమర్పించాలని పురావస్తు శాఖ డైరెక్టర్ డా. అర్జునరావును మంత్రి ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా. రాములు నాయక్, డా. నాగరాజు, సహాయ సంచాలకుడు బి.మధు, డి.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, ఉపాధి విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

రోజుల్లో క్షేత్రస్థాయి పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. గత పదేళ్లలో పెద్దపల్లి జిల్లాలో సుమారు రూ.900 కోట్ల రహదారి పనులు మాత్రమే మంజూరయ్యాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే రూ.1,700 కోట్ల విలువైన రహదారి పనులకు అనుమతులు మంజూరయ్యాయని చెప్పా రు. రహదారుల అభివృద్ధితో రైతులు, వ్యాపారులు తమ ఉత్పత్తులను వేగంగా రవాణా చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. పెద్దపల్లి బైపాస్ రహదారికి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.82 కోట్లు మంజూరు చేశామని కోమటిరెడ్డి తెలిపారు. పనులు కొనసాగుతు న్నాయని, ఏడాదిలోపు బైపాస్‌ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. హైదరాబాద్–రామగుండం కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారి ప్రతిపాదనలో సుల్తానాబాద్ బైపాస్‌ను చేర్చేందుకు కేంద్రంతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. రహదారి భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని మంత్రి సూచిం చారు. రహదారులు కూడా సంక్షేమ పథకాల మాదిరిగానే అభివృద్ధికి కీలకమని పేర్కొ న్నారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిం చాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగును విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మ సేద్యం, రుణ మాఫీ వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రైతులకు అవస రమైన ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ విప్ విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో గత రెండున్నరేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. జూలపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రాల్లో నాలుగు లేన్ల రహదారులు, మధ్య దీపాల ఏర్పాటు, పలు గ్రామాల్లో రహదారుల విస్తరణ పనులకు శంకుస్థాపనలు చేసినట్లు చెప్పారు. పెద్దపల్లి బైపాస్‌కు భూసేకరణ కోసం మరో రూ.27 కోట్లు త్వరలో విడుదల చేయించాలని కోరినట్లు తెలిపారు. ఏడాదిలోపు బైపాస్ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. సుల్తానాబాద్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నం దున బైపాస్ నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో గోదాముల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని శ్రీధర్‌బాబు అన్నారు. రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తు న్నామని తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# వివాదాలను పరిష్కరించుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

తరుణంలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన విస్తృత అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారని కేంద్రం ఓ ప్రకటనలో పేర్కొంది. జోనల్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శుల స్థాయిలో ఒక స్థాయీ కమిటీని కూడా కేంద్రం ఏర్పాటు చేసింది. రాష్ట్రాలు ప్రతిపాదించిన అంశాలను జోనల్ కౌన్సిల్ స్థాయీ కమిటీ ముందుంచుతారు. అనంతరం మిగిలిన అంశాలను పరిశీలన కోసం జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చకు ఉంచుతారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య పరస్పరం నెలకొన్న సమస్యల పరిష్కారానికి, వాటి పురోగతిపై చర్చించనున్నారు. మహిళలు, పిల్లలపై జరిగే అత్యాచార కేసుల దర్యాప్తు వేగవంతం, త్వరిత పరిష్కారం కోసం ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టుల ఏర్పాటు, అలాగే విద్యకు సంబంధించిన సమస్యలపైనా చర్చిస్తారు. ప్రాంతీయ స్థాయిలో ఉమ్మడి అంశాలపైనా చర్చ జరుగనుంది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టానికి సంబంధించిన సమస్యలు, నీటి పంపిణీకి సంబంధించిన ముఖ్యమైన ప్రాజెక్టులు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ), పౌర విమానయానానికి సంబంధించిన సమస్యలు తదితరాలపైనా సమావేశంలో చర్చించనున్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల సహకారంతో 2014 జూన్ నుంచి ఇప్పటి వరకూ వివిధ జోనల్ కౌన్సిళ్లు, వాటి స్టాండింగ్ కమిటీల సమావేశాలు మొత్తం 69 సార్లు జరిగాయని కేంద్రం పేర్కొంది. 'రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం–1956' లోని 15 నుంచి 22 సెక్షన్ల కింద దక్షిణ ప్రాంతీయ మండలి సహా మొత్తం ఐదు ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రానికి చెందిన కీలక అంశాలను ఈ సమావేశంలో చంద్రబాబు ప్రస్తావించనున్నారు. దక్షిణాది రాష్ట్రాల నడుమ సమన్వయం, అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారంతో పాటు ఏపీ పునర్విభజన చట్టం అమలు, పెండింగ్‌లో ఉన్న విభజన అంశాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అంశాలను సీఎం లేవనెత్తనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు పూర్తవుతున్నా పునర్విభజన చట్టంలోని వివిధ అంశాలు కొలిక్కి రాలేదు. వాటిని సీఎం ప్రస్తావించనున్నారు. అలాగే, షెడ్యూల్ 9–10లోని సంస్థల విభజన, ఆస్తులు, అప్పుల పంపకం, పెండింగ్ ఆర్థిక అంశాల పరిష్కారంపై కేంద్రం చొరవ తీసుకోవాలని చంద్రబాబు కోరనున్నారు. రెవెన్యూ గ్యాప్, పన్ను సంబంధిత అంశాలనూ ప్రస్తావించే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, దుగరాజపట్నం పోర్టు, విశాఖపట్నం, విజయవాడ మెట్రో ప్రాజెక్టులు, రైల్వే కనెక్టివిటీ, విమానాశ్రయాల అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్ల వంటి అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు వంటి అంశాల్లో కేంద్రం సహకారానికి కృతజ్ఞతలు తెలియజేయనున్నారు. అదే సమయంలో మిగిలిన ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు, నిధులు ఇవ్వాలని కోరనున్నారు.

### చంద్రబాబుకు ఘన స్వాగతం

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం సాయంత్రం విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఆయన చెన్నై చేరుకున్నారు. చెన్నై విమానాశ్రయంలో ఆయనకు టీడీపీ నేతలు చంద్రశేఖర్, రవిబాబు తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన నేరుగా సమావేశం జరిగే హోటల్‌కు ఆయన బయలుదేరి వెళ్లారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కర్ణాటక సీఎం శివకుమార్, కేరళ సీఎం సతీశన్, ఆయా రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు కూడా వేర్వేరుగా సమావేశ హోటల్‌కు చేరుకున్నారు. అక్కడే అమిత్‌షాతో ముఖ్యమంత్రులు వేర్వేరుగా భేటీ అయినట్లు తెలిసింది.

### ఫొటో జర్నలిస్టుగా సీఎం

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫొటో జర్నలిస్టులకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రను నమోదు చేస్తూ, జ్ఞాపకాలను పదిలపరుస్తున్న ఫొటోగ్రాఫర్లకు అభినందనలు అని సీఎం పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో తనను కలిసేందుకు వచ్చిన ఫొటోగ్రాఫర్లతో సీఎం సరదాగా ముచ్చటించారు. ఫొటోగ్రాఫర్ నుంచి కెమెరా తీసుకుని, ఫొటో జర్నలిస్టుగా మారి ఫొటోగ్రాఫర్లను గ్రూప్ ఫొటో తీశారు. పేరుపేరునా అందరినీ పలుకరించి వారితో విడివిడిగా ఫొటోలు దిగారు.

## సినిమా థియేటర్లలో ధరలపై ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త వేదిక సూర్య):

తెలంగాణలో సినిమా టికెట్ ధరలు, థియేటర్ల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్, స్పెషల్ థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలో నిర్దిష్టమైన టికెట్ ధరలను ఖరారు చేస్తూ హోంశాఖ జీవో ఎంఎస్ నెం. 77 జారీ చేసింది. 2021 తర్వాత సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ల ధరలను పెంచారు. మల్టీప్లెక్స్‌లలో ధరలను యథాతథంగా ఉంచారు. స్పెషల్ థియేటర్లు అనేదానికి స్పష్టమైన నిర్వచనం ఇచ్చింది. 7.1 సరౌండ్ సౌండ్ సిస్టమ్, 2కే లేదా 4కే ప్రొజెక్షన్, కనీసం 75 అడుగుల తెర ఉన్న థియేటర్లను స్పెషల్ క్యాటగిరీలో చేర్చింది. ఉదయం 8 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు రోజుకు 5 షోలు ప్రదర్శించుకొనేందుకు అనుమతి ఇచ్చింది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య ఒక చిన్న సినిమాను ప్రదర్శించేందుకు అవకాశం ఇవ్వాలని ఆదేశించింది. రూ.100 కోట్లకుపైగా బడ్జెట్‌తో తీసే సినిమాలను సూపర్ హై బడ్జెట్ సినిమాలుగా గుర్తిస్తున్నట్లు పేర్కొంది. ఇలాంటి సినిమాలకు మొదటి పది రోజులు మాత్రమే టికెట్ ధరలు పెంచుకొనేందుకు అవకాశం ఇచ్చింది. అది కూడా సినీ కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి విరాళం ఇచ్చే సినిమాలకు మాత్రమే టికెట్ ధరలు పెంచుకొనేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు వెల్లడించింది. అయితే, ఎంతమేర టికెట్ ధరలు పెంచుకోవచ్చన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. ఆన్‌లైన్‌లో బుక్‌చేసే టికెట్లకు ఏసీ థియేటర్ అయితే రూ.5, నాన్ ఏసీ థియేటర్ అయితే రూ.3 చొప్పున నిర్వహణ చార్జీలుగా నిర్ణయించింది. కాగా, టికెట్ ధరల పెంపుతో అదనపు ఆదాయం సమకూర్చుకున్న నాలుగు సినిమాల నిర్మాతలు తమ అదనపు ఆదాయం నుంచి 20శాతం డబ్బును తెలుగు సినీ పరిశ్రమ కార్మికుల సంక్షేమ నిధికి చెల్లించాల్సిందిగా ఆయా సినీ నిర్మాణ సంస్థలకు ప్రభుత్వం లేఖలు పంపింది. అఖండ–2, ది రాజాసాబ్, మన శంకర్ వరప్రసాద్ గారు, పెద్ది సినిమా టికెట్ ధరల పెంపుతో వచ్చిన అదనపు ఆదాయంపై సంక్షేమ విరాళంగా ఇవ్వాలని లేఖలో పేర్కొంది. నాన్ ఏసీ థియేటర్లలో నాన్ ప్రీమియం క్యాటగిరీ టికెట్ ధర కనిష్ఠంగా రూ. 30, గరిష్ఠంగా రూ.70. ప్రీమియం టికెట్ల ధర కనిష్ఠంగా రూ. 50, గరిష్ఠంగా రూ. 100. ఏసీ థియేటర్లలో నాన్ ప్రీమియంలో కనిష్ఠంగా రూ.50, గరిష్ఠంగా రూ. 150. ఏసీ థియేటర్లలో ప్రీమియంలో కనిష్ఠంగా రూ.100, గరిష్ఠ ధర రూ. 200. స్పెషల్ థియేటర్లలో నాన్ ప్రీమియంలో కనిష్ఠంగా రూ.100, గరిష్ఠంగా రూ. 250. ప్రీమియం, రిక్లైనర్ కనిష్ఠ ధర రూ.200, గరిష్ఠ ధర రూ.300. మల్టీప్లెక్స్‌లు రెగ్యులర్ కనిష్ఠ ధర రూ.100, గరిష్ఠ ధర రూ.250, రిక్లైనర్ కనిష్ఠం రూ. 200, గరిష్ఠ ధర రూ.300.

## ప్రిన్సిపాల్‌ను చంపింది




## విద్యార్థులే

నల్గొండ, ఆగస్టు 19 (వార్త వేదిక సూర్య):

సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు చేసిన ఘాతుకమని వెలిపారు. ఆ ఇద్దరు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన విడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది. రూపారెడ్డి నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారని ఎస్పీ3 వివరించారురు. సవిపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం అని ఎస్పీ వివరించారు.



# రంగారెడ్డి

# అంగరంగ వైభవంగా శ్రీ గడికోట మైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ





### 3 రోజుల పాటు వేద మంత్రోచ్ఛారణలు, బోనాల సమర్పణ

### ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల భారీ హాజరు

**మహేశ్వరం, ఆగస్టు 19: వార్త వేదిక సూర్య**

మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ గడికోట మైసమ్మ అమ్మ వారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజుల పాటు అంగ రంగ వైభవంగా జరిగి మంగళవారం మహాపూర్ణాహుతితో ముగిశాయి.

గ్రామ ప్రజలు, యువకులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**3 రోజుల పాటు వైదిక కార్యక్రమాలు**

ఈ నెల 17న గోపూజ, గణపతి పూజ, పుణ్యవచనం, పంచగవ్యము, యాగశాల ప్రవేశం, దీక్షా ఋత్విక్ వరణం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, నవగ్రహ వాస్తు, సర్వతోభద్ర మండల ఆరాధన, అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు, జలాధివాసం, మంగళహారతి, స్వస్తి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

18న ప్రాతఃకాల పూజల అనంతరం ఆవాహిత మండప దేవత హోమాలు, గణపతి, రుద్ర, నవగ్రహ, అమ్మవారి మూలమంత్ర హోమాలను అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు.

19న ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాలతో పాటు యంత్ర ప్రతిష్ఠ జరిగింది. ఉదయం 8.29 గంటలకు శాస్త్రోక్తంగా అమ్మవారి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం బింబ కళాన్యాసం, గర్త పూజలు, కళాన్యాసం, దిష్టికుంభం, బలి ప్రధానం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

**ప్రజాప్రతినిధులు, సంఘాల భాగస్వామ్యం**

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ పార్టీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, మాజీ జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితరెడ్డి పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ మున గపాటి నవీన్, ఉప సర్పంచ్ జోరల రమేష్, శివగంగ దేవాలయ చైర్మన్ అల్లే కుమార్, విగ్రహ దాత స్వర్ణ గంటి ఆనందం, కర్రోళ్ల చంద్రయ్య, అంబయ్య యా దవ్, పోతర్ల సుదర్శన్ యాదవ్, కాకి ఈశ్వర్, కూన యాదయ్య, ఒత్తుల రఘుపతి, పోల్కం బాలయ్య, కర్రోళ్ల రాములు, మోదీని శివమూర్తి, నిమ్మగూడ సుధీర్ గౌడ్, మాజీ సర్పంచ్ ప్రియాంక రాజేష్, ఎత్త య్యతో పాటు మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు. ముది రాజ్ సంఘం, కురుమ సంఘం, అంబేద్కర్ సంఘం, గంగ పుత్ర సంఘం, అఖిల భారత యాదవ సంఘం, బేడా బుడగ జంగాల సం ఘం, మున్నూ రుకాపు సంఘం, రజక సంఘం, పద్మశాలి సంఘం, వీరశైవ లింగా యత్ సమాజం, గౌడ సంఘం, ఆర్యవైశ్య సం ఘం, బైండ్ల సంఘం, ముష్టి గొల్ల యాదవ సంఘం, రాజా రాజేశ్వరి డ్రైవర్స్ అసోసియేషన్, రెడ్డి సంఘం, మెడికల్ అసోసియేషన్, ఉప్పరి సం ఘం, విశ్వకర్మ సం ఘం, కుమ్మరి సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, ఆరె కటిక సం ఘం, వడ్డెర సంఘం, పూసల సంఘం, మాల సంఘం, దాసరి సం ఘం, పిట్టల సంఘం, బ్రదర్స్ స్క్వాడ్ తదితరులు విజయవంతం చేశారు.



## బిఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టులను తీవ్రంగా ఖండించిన మాజీ కార్పొరేటర్ - కంది శైలజ

**సికింద్రాబాద్, ఆగస్టు 19(వార్త వేదిక సూర్య)**

సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రి సందర్శనకు వెళ్లకుండా బిఆర్ఎస్ నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడాన్ని బౌద్ధనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు కంది శైలజ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ..రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన కొనసాగుతోందా, లేక అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందా అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని కంది శైలజ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అదేవిధంగా ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజా సమస్యలను ప్రజల ముందుకు తీసుకువస్తామని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని ఆమె తెలిపారు. హౌస్ అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని కంది శైలజ డిమాండ్ చేశారు.

## వైశాలి గార్డెన్స్‌లో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి

### బిఆర్ఎస్ నాయకురాలు - మురారి స్మితా కోటేశ్ గౌడ్

**సికింద్రాబాద్, ఆగస్టు 19(వార్త వేదిక సూర్య)**



వైశాలి గార్డెన్స్‌లో మౌలిక వసతుల మెరుగుదలకు నా వంతు కృషి ఎల్లపుడూ ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ మహిళ సీనియర్ నాయకురాలు మురారి స్మితా కోటేశ్ గౌడ్ తెలిపారు. బుధవారం కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ప్లేగ్రౌండ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన మార్పులు, సౌకర్యాలు మరియు కొత్త ఆట పరికరాల ఏర్పాటుపై వేణు తో కలిసి పరిశీలించి ప్లేగ్రౌండ్‌ను మరింత మెరుగ్గా తీర్చిది ద్దేందుకు అవసరమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మురారి స్మితా కోటేశ్ గౌడ్ మాట్లాడుతూ..వైశాలి గార్డెన్స్ ప్రజల సమస్యలను సంబంధిత అధికా రుల దృష్టికి తీసుకెళ్లి, ప్లేగ్రౌండ్‌కు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పరిసర ప్రాంతాల్లో రహదారి భద్రతను పెంపొందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ప్రశ్నించే నాయకులను నిర్బంధించడం దారుణం

### బిఆర్ఎస్ నాయకులు - రాజేష్

**సికింద్రాబాద్, ఆగస్టు 19(వార్త వేదిక సూర్య)**



ప్రశ్నించే నాయకులను నిర్బంధించడం దారుణమని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజేష్ మండిపడ్డారు. సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించేందుకు వెళ్తున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడాన్ని ఆయనా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరైన పద్ధతి కాదని, హౌస్ అరెస్టులతో ప్రజా సమస్యలను పరిష్కరించలేరని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే హౌస్ అరెస్టులను ఎత్తివేసి, ప్రజా ప్రతినిధులు మరియు రాజకీయ నాయకులు టీమ్స్ ఆస్పత్రిని సందర్శిం చేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఎ ఒక్కటి కూడా పూర్తిగా నెరవేర్చలేదని ఆరోపించారు.

## ప్రముఖ బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్‌ను పరామర్శించిన కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్

**రాజేంద్రనగర్, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య ) :**

ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ప్రముఖ బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్‌ను కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ?మల్లేష్ నివాసానికి వెళ్లిన వెంకటేష్, ఆయన ఆరోగ్య పరిస్థితిని మరియు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... క్యామ మల్లేష్ త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకొని, మళ్లీ ఎప్పటిలాగే ప్రజా జీవితంలోనూ, పార్టీ కార్యకలాపాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ?ఈ పరామర్శ కార్యక్రమంలో తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ శ్రీశైలం, మణికొండ మాజీ కౌన్సిలర్ ముత్యాలుతో పాటు పార్టీ ముఖ్య నాయకులు అడికె అర్జున్, గూడెం సత్యనారాయణ, ఆనంద్, అశోక్, రమేష్, రామస్వామి, రిషి, సంతోష్ పాల్గొన్నారు.

# జీవో నెం. 97 రద్దు చేయాలి

### 400 మంది పాలిటెక్నిక్ విద్యార్థులతో ఏబీవీపీ భారీ ర్యాలీ

### "విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే జీవోను ఉపసంహరించాలి"

**మహేశ్వరం ఆగస్టు 19 వార్త వేదిక సూర్య**



జీవో నెం. 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మహేశ్వరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి రాజేష్ నాయకత్వంలో సుమారు 400 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ రగుడబ్బ వరకు కొనసాగింది.

విద్యార్థుల భవిష్యత్తుకు ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరగాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యక్ష ప్రభావం చూపే జీవో నెం. 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి, పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సమస్య పరిష్కారం అయ్యే వరకు ఏబీవీపీ ప్రజాస్వామ్య పద్ధతిలో మరిన్ని ఉద్యమ కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అభిలాష్, చింటూ, ప్రాంతి, సాయికార్తిక్, రోహిత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



## కోట మైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠకు 1,00,116 రూపాయల విరాళం

### అందజేసిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోతర్ల అంబయ్య యాదవ్

**మహేశ్వరం ఆగస్టు 19 వార్త వేదిక సూర్య**

మహేశ్వరం మండల కేంద్రంలోని కోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోతర్ల అంబయ్య యాదవ్ 1,00,116 రూపాయల భారీ విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని ఆయన గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్‌కు అందజేశారు.

పెద్దల సమక్షంలో విరాళం అందజేత

ఈ కార్యక్రమంలో కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం, పోతర్ల సుదర్శన్ యాదవ్, ఉప సర్పంచ్ జోరల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ పోల్కం బాలయ్య, మాజీ ఉపసర్పంచ్ కర్రోళ్ల రాములు, వార్డు సభ్యులు రేవెల్ల చంద్రమౌళి, కాకి పరమేష్ ముదిరాజ్, దుడ్డు కృష్ణ యాదవ్, ఏపూరి రాజు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గదగుట్టి ఎట్టయ్య ముదిరాజ్, ఏపూరి వెంకటేష్, తెల్జీరి లక్ష్మయ్య యాదవ్, వంగూరి మల్లేష్ యాదవ్, పోతర్ల సంఘం యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం అభివృద్ధి చెందాలని అంబయ్య యాదవ్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# ట్యాంక్ బండ్ పై సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణ చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు



కల్లు గీత కార్మిక సంఘం

**హైదరాబాద్ ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య )**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 న మహబూబాబాద్ లో ప్రారంభమైన అమరుల యాధిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర 31 జిల్లాలు పర్యటించి 18వ తేదీ రాత్రి హైదరాబాద్ ట్యాంక్ బండ్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద ముగించడం జరిగిందిలి. ఈ సందర్భంగా బూడిద గోపి అధ్యక్షతనలి జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ మాట్లాడుతూ ట్యాంక్ బండ్ పై సర్వాయి పాపన్న విగ్రహాన్ని ప్రతిష్టించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పాపన్న స్ఫూర్తితో శ్రామిక రాజ్య స్థాపన కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వృత్తిలో ప్రమాదం జరిగిన గీత కార్మికులకు 3 సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉన్న ఎక్స్‌గ్రేషియా 20 కోట్ల రూపాయలు 18వ తేదీన బాధితులకు ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.వీటి కొరకు గత మూడు సంవత్సరాలుగా సంఘం ఆందోళన పోరాటాలు నిర్వహించింది అన్నారు.50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులందరికీ పెన్షన్ ఇస్తామని, వృతి చేసే వారందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇస్తామని సభలో ముఖ్య మంత్రి చెప్పిన దానిని ఆచరణలో అమలు చేయాలన్నారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు ఇస్తామని, వృత్తిలో ఆధునీకరణ పద్ధతులు తీసుకువస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ గారు చెప్పిన దానిని ఆచరణలో అమలు చేసి చూపాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లులి మాట్లాడుతూ చెట్ల పెంపకానికి సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, నందనములోని నీరా తాటి ఈత ఉత్పత్తుల ప్రాజెక్టు వెంటనే ప్రారంభించాలని, పెన్షన్ 4వేలు, ఎక్స్‌గ్రేషియా పది లక్షలకు పెంచాలని, ఏజెన్సీ ఏరియాలో సొసైటీలను పునరుద్ధరించాలని అన్నారు. గోప రాష్ట్ర అధ్యక్షులు బండి సాయన్న గౌడ్ , సుప్రజ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శిగ విజయ్ కుమార్ గౌడ్ కె వి పి స్ రాష్ట్ర కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు యాత్రకు సంఘీభావం తెలిపారులి. 17 రోజులపాటు సాగిన యాత్రలో పాల్గొన్న బృందం సభ్యులందరినీ అభినందించారు. ఇంకా ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, బొలగాని జయరాములు, గౌని వెంకన్న, బాల్నే వెంకట మల్లయ్య, గౌని సాంబయ్య, ఎల్గూరి గోవిందు, కార్యదర్శులు చౌగాని సీతారాములు, బుర్ర శ్రీనివాస్ గౌడ్ , కొండం కరుణాకర్ , రాగిరి కృష్ణయ్య, మెరుగు వీరస్వామి రాష్ట్ర గౌరవ సలహాదారులు భీమగోని చంద్రయ్య, పామనుగుల్ల అచ్చాలు, బృందం సభ్యులు మొక్క నాగేశ్వరరావు, బుర్ర సుధాకర్, తాళ్లపల్లి నర్సయ్య, పాలకూరి జగన్ మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్ర స్వప్న , ఎం కృష్ణ స్వామి గౌడ్, కుర్ర ఉప్పలయ్య, బోడపట్ల సుదర్శన్ ,సురుగు రాజేష్ ,రాంబాబు, కంకటి రాజన్న పరిధుల భాస్కర్ మాచర్ల రఘురాములు బండపల్లి శంకరయ్య , జనగాం జిల్లా సహాయ కార్యదర్శి బస్వగాని మహేందర్ గౌడ్, కె జి కె స్ కార్యకర్తలు వివిధ మండల నాయకులు పాల్గొన్నారు...

## పిఆర్‌టియు రాజేంద్రనగర్ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**రాజేంద్రనగర్, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య )**



పంచాయతీ రాజ్ టీచర్స్ యూనియన్ (పిఆర్‌టియు) రాజేంద్రనగర్ మండల శాఖ నూతన అధ్యక్షులుగా సుదర్శన్ కడుమూరు, ప్రధాన కార్యదర్శిగా ఆస్కానీ శ్రీనివాస సాగర్, గౌరవాధ్యక్షులుగా మాణిక్యం రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ?శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పిఆర్‌టియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి ఈ నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు. ?ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్య శ్రీను నాయక్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కొనగారి కృష్ణారెడ్డి, అధికార మాసపత్రిక సంపాదకులు జగన్మోహన్ గుప్తా, గౌరవాధ్యక్షులు పెద్దమారూ రాఘవేందర్ హాజరై ఎన్నికైన బాధ్యులకు అభినందనలు తెలిపారు. ?ఎన్నికల పరిశీలకులుగా శివరామ్, హనుమంతు, రాజశేఖర్ గౌడ్, సురేష్, సుధాకర్, వహీద్ వ్యవహరించగా.. మండల కార్యవర్గ సభ్యులు రవీందర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, సత్యన్నా, అల్లవెల్లి, రోహిణి పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రజలకు అండగా బీఆర్ఎస్ ఓటరు సహాయ శిబిరం

**రాజేంద్రనగర్, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య ) :**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 127వ మణికొండ మున్సిపల్ డివిజన్‌లో 33,423 మంది ఓటర్లకు గాను 17,826 మంది ఓటర్ల వివరాలు, అంటే 53.33 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని బీఆర్ఎస్ స్థానిక నాయకులు గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, సుమనలిని, జైరామ్, షేక్ ఆరిఫ్, ముత్యాలు తెలిపారు. అదేవిధంగా 128వ నెక్నంపూర్ మున్సిపల్ డివిజన్‌లో 38,431 మంది ఓటర్లు ఉండగా, 21,290 మంది ఓటర్ల వివరాలు అంటే 58.4 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని పేర్కొన్నారు. గతంలో ఉన్న 58 పోలింగ్ కేంద్రాలను 53కి మార్చినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో బుధవారం శివాజీనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఓటరు సహాయ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కొత్తగా వెలువడిన ఓటరు జాబితాలో 29వ పోలింగ్ కేంద్రం నుంచి 81వ పోలింగ్ కేంద్రం వరకు ఉన్న జాబితాలను సేకరించి, ప్రజలు తమ పేర్లు సక్రమంగా నమోదయ్యాయా లేదా అనే సందేహాలను నివృత్తి చేసుకునేలా వివరాలు అందించారు. స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కుటుంబ సభ్యుల ఓటు వివరాలను పరిశీలించుకున్నారు. కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో కాకుండా వేర్వేరు కేంద్రాల్లో నమోదు కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని కుటుంబ సభ్యుల ఓట్లను వీలైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా సర్దుబాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని వారు బూత్ స్థాయి అధికారులు జారీ చేసే నోటీసుల కోసం ఎదురుచూస్తున్నారని, అవసరమైన ఆధారాలను సమర్పించి తమ ఓటు హక్కును పొందేందుకు సిద్ధంగా ఉన్నారని నాయకులు తెలిపారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## రాజేంద్రనగర్‌లో ఎస్ఐఆర్ రెండో దశ అసెంబ్లీ కార్యశాల

### - ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన

**రాజేంద్రనగర్, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య ) :**



రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషా బాద్‌లోని రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రెండో దశ అసెంబ్లీ కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజస్థాన్ రాజ్యసభ సభ్యురాలు అల్కా సింగ్ గురజార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి అల్కా సింగ్ గురజార్‌ను స్వాగతించారు. అనంతరం మాజీ ఎంపీ మర్రి శశిధర్ రెడ్డిని కూడా స్వాగతిస్తూ నియోజకవర్గ నాయకులతో కలిసి కార్యశాలలో పాల్గొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, ఓటర్ల వివరాల పరిశీలన, జాబితా పారదర్శకతకు సంబంధించిన అంశాలపై కార్యక్రమంలో చర్చించారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు

# సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ జీవో 641 రద్దు చేయాలి



**పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి జిల్లాను అభివృద్ధి చేయాలి**

**సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్**


**షాద్‌నగర్‌కు చేరుకున్న ప్రజా చైతన్య యాత్ర**

రాజేంద్రనగర్, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య ) :

సిద్ధాపూర్‌కు ప్రమాదకరంగా మారిన డంపింగ్ యార్డ్‌కు సంబంధించిన జీవో 641ను వెంటనే రద్దు చేయాలని, రంగారెడ్డి జిల్లాకు ఎంతో ప్రయోజనం చేకూర్చే పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నిధులు పెంచి సత్వరమే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ కేంద్ర కమిటీ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర బుధవారం షాద్‌నగర్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ కూడలిలో సభ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాలమాకుల జంగయ్య మాట్లాడారు. బడ్జెట్ జరూర్ హై.. మార్పు కావాలి అనే నినాదంతో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు జంగయ్య తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా చేపడుతున్న పాదయాత్రలు, బస్సు యాత్రల్లో భాగంగా రంగారెడ్డి జిల్లాలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు దేశ ఆర్థిక పరిస్థితి, రూపాయి విలువ సాధారణ స్థితిలో ఉండేవని, గత 12 సంవత్సరాల కాలంలో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిపోయి సంక్షోభం పెరిగిందని జంగయ్య విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయే తప్ప పేదలు, మధ్యతరగతి ప్రజలు, కార్మికులకు న్యాయం జరగడం లేదని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరించి నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆయన ఆరోపించారు.

సంవత్సరానికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను కూడా కోల్పోయే పరిస్థితి కల్పిస్తూ నిరుద్యోగాన్ని పెంచుతోందని విమర్శించారు. దేశంలోని నిరుద్యోగులు, యువత ఏకమై కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని, వారి పోరాటానికి సీపీఐ అండగా ఉంటుందని జంగయ్య తెలిపారు. ప్రజా చైతన్య యాత్ర ఈ నెల 21న అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో నిర్వహించే భారీ బహిరంగ సభతో ముగుస్తుందని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, బుద్ధుల జంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. ప్రభులింగం, ఎం. శ్రీను, పి. శివకుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ, పవన్, చౌహాన్, చంద్రబాబు, ఆకాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.






## వరల్డ్ ఫోటో గ్రఫీ డే సందర్భంగా ది హన్స్ ఇండియా ఫోటోజర్నలిస్ట్ శ్రీనివాస్ శెట్టి కి ఘన సత్కారం

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య )

వరల్డ్ ఫోటో గ్రఫీ డే సందర్భంగా స్కై ఫౌండేషన్ ఆధ్వర్యం లో విశిష్ట సేవలు అందిస్తున్న ది హన్స్ ఇండియా ఫోటోజర్నలిస్ట్ శ్రీనివాస్ శెట్టి ని ఘనంగా సత్కరించి, మెమొంటో, సర్టిఫికెట్ ను అందించారు. ఈ సందర్భంగా స్కై ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని మాట్లాడుతూ..ఒక్క క్లిక్ తో మనస్సును తాకే శక్తీ, దేశాన్ని కదిలించే శక్తీ, శాసించే శక్తీ ఒక్క ఫొటోకు మాత్రమే ఉంటుంది. అలాంటి ఫోటోలను తీసే ఫోటో గ్రాఫర్ల ను అభి నందించడం బాధ్యతాయుతమైన చర్యగా భావించి సన్మాన కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు.



## కాటేదాన్ గణేష్ నగర్‌లో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రాజేంద్రనగర్, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య ) :

డివిజన్ పరిధిలోని కాటేదాన్ గణేష్ నగర్‌లో ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్ సహకారంతో సుమారు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లా డుతూ రోడ్డు నిర్మాణంతో కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు తొలగి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ, టీ. ప్రేమ్ గౌడ్, బాస శ్రీనివాస్, కే. లక్ష్మారెడ్డి, గట్టయ్య, బుచ్చయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## అత్తాపూర్ పోలీసుల చొరవతో 25 పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీ

రాజేంద్రనగర్, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య ) :




కేంద్ర ప్రభుత్వ కేంద్ర పరికర గుర్తింపు నమోదు (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా అత్తాపూర్ పోలీసులు రికవరీ చేసిన సుమారు రూ.2 లక్షల విలువైన 25 మొబైల్ ఫోన్లను బుధవారం బాధితులకు అందజేశారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. సీతయ్య బాధితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, తగిన ఆధారాలను పరిశీలించిన అనంతరం వారి మొబైల్ ఫోన్లను స్వయంగా అందజేశారు. పోయాయనుకున్న తమ విలువైన ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ అత్తాపూర్ పోలీసులకు, నేరాల దర్యాప్తు బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. సీతయ్య మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా ప్రజలు ఆందోళన చెందకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చన్నారు. సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ అంతర్జాతీయ మొబైల్ పరికర గుర్తింపు సంఖ్య (ఐఎంఈఐ)ను నమోదు చేసి ఫోన్‌ను నిలిపివేయడం ద్వారా దుర్వినియోగాన్ని అడ్డుకోవడంతో పాటు, ఫోన్‌ను గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకోవడం సులభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ నేరాల దర్యాప్తు విభాగం ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్‌తో పాటు నేరాల దర్యాప్తు బృందం సిబ్బంది పాల్గొన్నారు

## బస్సు సర్వీసులను పెంచాలి

గట్టుప్పల.ఆగస్టు19.వార్త వేదిక సూర్య:



నల్లగొండ గట్టుప్పల్-చౌటుప్పల్ బస్సు సర్వీసులను పెంచాలని గట్టుప్పల గ్రామ వార్డు సభ్యులు జిల్లా ఆర్టీసీ డిఎం ను కలిసి వినతిపత్రం అందజేశారు. నల్గొండ గట్టుప్పల చౌటుప్పల్ రూట్ లో సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. కలిసిన వారిలో వార్డు సభ్యులు బావండ్ల శ్రీనివాస్, జూలూరు పురుషోత్తం,నారని జగన్ బిఆర్ఎస్ నాయకులు చిలుకురి ఆంజయ్య ఉన్నారు

## గాజులరామారం లో రూ.79 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్: ఆగస్టు 19 (వార్త వేదిక సూర్య)

గాజులరామారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో రూ.79 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు శ్రీ కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు. శ్రీ వెన్ ఎంక్లేవ్‌లో రూ.38 లక్షలు, సరస్వతి ఆర్కేడ్‌లో రూ.20 లక్షలు, మెట్కన్ గూడలో రూ.21 లక్షల నిధులతో మొత్తంగా ఈ పనులను చేపట్టనున్నారు.

ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ గారు మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో కోట్లాది రూపాయలతో అంతర్గత డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనూ అదే తరహాలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఈ ప్రాంతాల అభివృద్ధికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడానికి సహకరించిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు గారికి కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ స్థానిక కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్‌తో పాటు కాలనీ అధ్యక్షులు మరియు సభ్యులు శ్రీధర్ గౌడ్, సోమరాజు, రాజశేఖర్ రెడ్డి, కేశవ రెడ్డి,విజయ్ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సునీల్, భూపాల్ రెడ్డి మరియు కాలనీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠాలు చెప్పిన టీచర్‌ను హతమార్చిన విద్యార్థులు




### రూపారెడ్డి హత్య కేసును ఛేదించిన నల్లగొండ జిల్లా పోలీస్

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య )

కొండమల్లేపల్లి పరిధిలో నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సవాలుగా తీసుకుని వెంటనే దేవరకొండా డియస్పీ అధ్వర్యంలో 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నేరస్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఆధునిక దర్యాప్తు పద్ధతులను ఉపయోగిస్తూ అన్ని కోణాల్లో విచారణ కొనసాగించాలని ప్రత్యేక బృందాలకు ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఫోరెన్సిక్ ఆధారాలు, ఫింగర్‌ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరా ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారాలు, పాత నేరస్తుల వివరాలు, అనుమానితుల కదలికలు, రౌడీషీటర్ల వెరిఫికేషన్ తదితర అంశాలను ప్రత్యేక బృందాలు క్షుణ్ణంగా పరిశీలించారు. హత్య జరిగిన ప్రదేశంతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 30 కిలోమీటర్ల పరిధిని 360 డిగ్రీల కోణంలో పరిశీలిస్తూ, సుమారు 70 సీసీ కెమెరాల ఫుటేజీలను ప్రతిరోజూ రాత్రి పగలు కష్టపడి విశ్లేషించారు.టెక్నికల్ అనాలసిస్, ఇన్ఫర్మేషన్ టీమ్స్‌తో కలిపి మొత్తం 5 ప్రత్యేక బృందాల్లో సుమారు 40 మంది పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమించి 80 మందికి పైగా అనుమానితులను విచారించారు.

**కేసును కీలక మలుపు తిప్పిన ... ఒకే ఒక్క పదం!**

హత్యకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో చివరిగా "బాబు" అని పలికారు. అనంతరం ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో, "ఆమె చివరిగా బాబు అని ఎవరిని ఉద్దేశించి మాట్లాడారు?" అనే ప్రశ్న పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారింది. ఈ కోణంలో విచారణ చేపట్టగా, రూపారెడ్డి తన పాఠశాలలో విద్యార్థులను సాధారణంగా "బాబు" అని పిలిచేవారని పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో దర్యాప్తు పాఠశాల విద్యార్థుల వైపు మళ్లింది. ప్రిన్సిపల్ మరణానికి సంతాప సూచకంగా పాఠశాలకు వరుసగా ఆరు రోజులు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులను విచారించడంలో కొంత ఆలస్యం జరిగింది. పాఠశాల పునః ప్రారంభమైన అనంతరం పోలీసులు విద్యార్థులను ఒక్కొక్కరిని సున్నితంగా విచారిస్తూ దర్యాప్తును కొనసాగించారు. ఈ క్రమంలో రెండు రోజులుగా పాఠశాలకు హాజరుకాని కొంతమంది విద్యార్థులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వారిలో అయిదుగురు విద్యార్థులు కొత్తగా జల్సాలకు అలవాటు ఐనా వారిపై ప్రత్యేక దృష్టి సాదించినారు. నేరస్థలం లో లభించిన సిసిటివి ఫూటేజ్ లు అనుమానిత విద్యార్థులతో సరిపోలడంతో వారిపై ప్రత్యేక దృష్టి సారించి నేరానికి పాల్పడినది సదరు విద్యార్థులే అని నిర్ధారించుకొని నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం పెండ్లిపాకల "ఎక్స్" రోడ్డు నుండి మల్లేపల్లి వస్తున్నగా దొనియాల ఎక్స్ రోడ్ వద్ద బైక్‌పై వస్తున్న పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకుని సున్నితంగా విచారించి తనిఖీ చేయగా లోదుస్తుల్లో నగదు దాచుకున్నట్లు గుర్తించారు. అందులో సుమారు రూ.1.54 లక్షల నగదు, అలాగే స్వాదీన పరు చుకున్న మూడు 500 నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. నగదు ఎక్కడి నుంచి వచ్చిందని విచారించగా, ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యకు పాల్పడి నగదును అపహరించినట్టు వెల్లడించారు. అరెస్టైన వారిలో నల్లగొండ జిల్లా లోని కొండమల్లేపల్లి మండలం, పుల్సింగ్ తండా, పిల్యతండ కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. ఈ ఇద్దరు విద్యార్థులు నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ లో పదవతరగతి చదువుతున్నారు.

**హత్యకు పథకం ఎలా రచించారు ?**

నిందితులు ఇద్దరూ నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ పాఠశాల లో 10 తరగతి చదువుతూ హాస్టల్ లో ఒకే గది లో ఉంటున్నారు. వీరు జల్సాలు, చెడు వ్యసనలకు అలవాటుపడి హాస్టల్ గదులలో వారి తల్లి తండ్రులకు తెలియ కుండ సెల్ ఫోన్ లు వినియోగిస్తూ సోషల్ మీడియా , యూట్యూబ్ లలో డబ్బులు తేలికగా ఏలా సంపాదించాలి అని వెతికేవారు. గతనెలలో వీరిద్దరు హాస్టల్ లో డబ్బులతో ప్రిన్సిపాల్ కి దొరికారు. ఆ విషయంలో ప్రిన్సిపల్ వారి తల్లి తండ్రుల సమక్షంలో మందలించగ ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని ప్రిన్సిపల్ పై కక్ష పెంచుకన్నారు. ప్రిన్సిపల్ రూపారెడ్డి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉంటుందని భావించి సోషల్ మీడియాలో ఆదారాలు దొరకుండా హత్యపై అన్వేషన చేసి హత్యకు పాల్పడి. నగదును అపహరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది ఎస్పీ పేర్కొన్నారు. పథకంలో భాగంగా వీరిద్దరు గత వారం రోజులనుండి ప్రిన్సిపల్ రూపారెడ్డిని అంతమొం దించాలని సాంకేతికంగా దొరకాకుండా రెక్కి నిర్వహించి వారి ప్రణాళికలో భాగంగా మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి, బ్యాగులో నుంచి ఎరుపు రంగు హుడీ టీషర్ట్, ప్యాంట్ తీసుకుని వచ్చాడు. అనంతరం కొండమల్లే పల్లిలో ఇద్దరు కలిసి కత్తి, గ్లౌజులు కొనుగోలు చేశారు. రూపారెడ్డి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని, ఎవరైనా వస్తున్నారా అని ఒకరు గమనిస్తుండగా మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించాడు. అప్పటికే తెరిచి ఉన్న వంటగది ద్వారా ఇంట్లోకి ప్రవేశించి రూపారెడ్డిపై కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం బెడ్‌రూమ్‌లో ఉన్న 2.50 లక్షల నగదును తీసుకుని ఇంటి వెనుక గోడ దూకి నిర్మానుష్య ప్రాంతం నుంచి వెళ్లిపో యారు. కత్తి, గ్లౌజులు, మాస్క్, సెల్‌ఫోన్‌ను చెట్ల పొదల్లో పడేశా రు. కొంత దూరంలో బట్టలు మార్చుకుని, ఎరుపు రంగు హుడీ ని డ్రైనేజీలో వేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు విచారణలో వెల్లడైంది.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు..**

పోలీసులు నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదు, మృతురాలి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తి, చేతి గ్లౌజులు, మాస్కులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, మల్లెపల్లి సీఐ నవీన్ కుమార్, సి.సి.ఎస్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి, మల్లెపల్లి ఎస్ఐ రమేష్, చింతపల్లి ఎస్ఐ రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ నరసింహులు, గుర్రంపోడు ఎస్ఐ వెంకన్న, సి.సి.ఎస్ ఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు కరుణాకర్, విష్ణువర్ధనగిరి, వహీద్ పాషా, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, ప్రసాద్ రావు, ఫయాజ్, ప్రభాకర్, కానిస్టేబుళ్లు హేము నాయక్, గులాం దస్తగిరి, సాయికుమార్, శివరాజ్, జునైద్ అహ్మద్, నరేష్, సాయి, కమల్ కిషోర్, వేణుగోపాల్ రెడ్డి, భాస్కర్, శరన్ రెడ్డి, నాగరాజు, అనిల్, హెచ్‌జీ శేఖర్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేస్తుంది : మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి..

**కంచర్ల సమక్షంలో బిఆర్ఎస్ లో చేరిన చందనపల్లి గ్రామం చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు..**

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య )





: మోసపు మాటలు, అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందని నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ఆరోపించారు. బుధవారం నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పెద్ది ఇందిరమ్మ వెంకటయ్య, మాజీ సర్పంచ్ సురిగి మణెమ్మ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో కేబిఆర్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు కంచర్ల భూపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ ఏ ఆశయ సాధన కోసం కెసిఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించారో ఆ ఆశయాలకు రేవంత్ రెడ్డి తూట్లు పొడుస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని మండిపడ్డారు. కెసిఆర్ ప్రభుత్వంలో సంబాండవర్గాలకు అందిన అభివృద్ధి సంక్షేమ ఫలాలు నేడు వారికి అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి తాను ఎమ్మెల్యేగా కేసిఆర్ నాయకత్వంలో సాధించిన అభివృద్ధిని తనదిగా చెప్పుకుంటూ కొన్ని శంకుస్థాపనలు కొన్ని ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ఇది వారి దివాలా తనాన్ని తెలియజేస్తుందన్నారు. ఎప్పుడో మంజూరైన ఎల్లమ్మ గుడి రామగిరి డిఈఓ రోడ్డు శంకుస్థాపన చేస్తూ తాను మంజూరు చేసినట్టుప్రచారం చేసుకుంటున్నారని అదేవిధంగా మర్రిగూడ బైపాస్ రోడ్డు 45 కోట్లు తాము మంజూరు చేయించి దాదాపు పూర్తయ్యే సమయంలో పనులు ఆపించి మరో 15 కోట్లు అదనంగా తన కమిషన్ల కోసం ఎస్టిమేట్ ధరలు పెంచి అక్కడ కొన్ని ప్రాణాలు పోయిన తర్వాత తాను ధర్నా చేస్తే అప్పుడు ప్రారంభించారని తెలిపారు. ఇప్పటికైనా మంత్రి ఇలాంటి చవక బారు దగా కోరు ప్రచారాలు మానుకొని నల్లగొండ అభివృద్ధికి మరోవెయ్యి కోట్లు మంజూరు చేయించాలని కోరారు. ప్రజలు వీరి దగాకూరు విధానాలు మోసాలు అర్థం చేసుకున్నారని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వీరికి తగిన శాస్తి చెప్పడం ఖాయమని కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల మంత్రి నాయకత్వం పట్ల ప్రజలకు తీవ్రమైన వ్యతిరేకం ఉందని అందుకనే బి ఆర్ఎస్ పార్టీలోకి పెద్ద ఎత్తున వలసలు ప్రారంభమయ్యారని మొన్న ధర్వేశిపురం ఈరోజు చందనపల్లి నుండి పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరడమే దీనికి నిదర్శనం అన్నారు. అందరూ కలిసి పార్టీ అభివృద్ధి కోసం తిరిగి కేసీఆర్ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఏర్పడటం కోసం ప్రజలతో మమేకం అయ్యి పని చేయాలని కోరారు. పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ సురిగి మణెమ్మ రమేష్ గౌడ్ మాట్లాడుతూ బి ఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కంచర్ల భూపాల్ రెడ్డి నాయకత్వంలో సైనికులు లాగా పని చేస్తామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కంచర్ల భూపాల్ రెడ్డి ని ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ఆహర్నిశలు కృషి చేస్తామని అన్నారు.

బి ఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో తంతెనపల్లి శంకర్ పగిడిపాల వెంకన్న చింత ఇంద్రయ్య పొడిచేటి గోపాల్ ఉప్పలపాటి పవన్ కళ్యాణ్ తంతనపల్లి సాయిలు కంభంపాటి సందీప్ జక్కలి రాములు తంతెనపల్లి స్వామి సురేష్ రవి చిన్న శంకర్ పాలడుగు శంకర్ తెలగమల్ల చంటి చంటిబాబు, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత కార్మిక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు దేప వెంకట్ రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, మాజీ ఎంపీపీ నారాబోయిన బిక్షం, మాజీ జడ్పిటిసి తుమ్మల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర కీలకం

నల్లగొండ బ్యూరో, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య )



187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బుధవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లో ఫోటో జర్నలిస్టులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఫోటో జర్నలిస్టులకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రఫీ పోటీల్లో అవార్డులు సాధించిన ఫోటో జర్నలిస్టులను అభినందించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వంద భావాలను ఒకే దృశ్యంలో ఆవిష్కరించే శక్తి ఫోటోకు ఉందని కొనియాడారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ..సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఫోటో జర్నలిస్టుల కృషి అభినందనీయమని ప్రశంసించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్లు అందిస్తున్న సేవలు ముఖ్యమైనవని పేర్కొన్నారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫోటోగ్రఫీ పోటీల్లో అవార్డులు సాధించిన 'సాక్షి' ఫోటో జర్నలిస్ట్ కంది బజరంగ్ ప్రసాద్, 'ది హాన్స్ ఇండియా' ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్‌లను అధికారులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటో జర్నలిస్టులు ముచ్చర్ల విజయకుమార్, కంది శీను, కారింగు శ్రీను, కనకయ్య, కారింగు వెంకన్న, భవాని ప్రసాద్, జర్నలిస్టులు కత్తుల హరి, గోలి నాగరాజు, వై. సాగర్, మేడి వినోద్ తదితరులు పాల్గొన్నారు.



# నాగర్‌కర్నూల్



## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో ఫోటో జర్నలిస్టులకు సన్మానం


**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య )**

187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లగొండలో ఫోటో జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ఫోటో జర్నలిస్టులతో కలిసి కేక్ కట్ చేసి ఫోటోగ్రఫీ డే శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డు సాధించిన సాక్షి సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కంది భజరంగ్ ప్రసాద్ను, ఇతర ఫోటోగ్రాఫర్లను మేయర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఒక ఫోటో వెయ్యి మాటలతో సమానమని, సమాజంలో జరిగే ప్రతి ముఖ్యమైన సంఘటనను ప్రజల కళ్లముందుకు తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్లు, ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. చరిత్రకు దృశ్య సాక్ష్యాలుగా నిలిచే ఫోటోలను అందిస్తున్న ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా మంచి ఫోటో వెనుక ఫోటోగ్రాఫర్ ప్రతిభ, పరిశీలనా శక్తి, సృజనాత్మకత ఎంతో ముఖ్యమన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అవార్డులు సాధించిన ఫోటో జర్నలిస్టులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను ఆవిష్కరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఫోటోగ్రాఫర్లు కంది శ్రీనివాస్ ప్రసాద్, కనకయ్య, భవాని ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, వంగాల అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

## యువత జిల్లా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలి

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ ఆగస్టు 19 ( వార్తా వేదిక సూర్య ) :**



నాగర్‌కర్నూల్ జిల్లా గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పరిస్థితులను స్వయంగా పరిశీలించి, అక్కడ చదువుకుంటున్న నిరుద్యోగ యువతీ యువకులతో మాట్లాడారు. వారు ఏయే ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్నారో, వారి చదువు ప్రణాళిక, ప్రతిరోజూ చదువుకు కేటాయిస్తున్న సమయం, ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అందుబాటులో ఉన్న పుస్తకాలు, ఇతర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న వివిధ రకాల పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు అవసరమైన జనరల్ స్టడీస్, జనరల్ నాలెడ్జ్, చరిత్ర, భూగోళశాస్త్రం, భారత రాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ, విజ్ఞానశాస్త్రం, సమకాలీన అంశాలకు సంబంధించిన పుస్తకాల లభ్యతను పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లోని దినపత్రికలను యువత ఏ విధంగా వినియోగిస్తున్నారో గమనించారు.

సమకాలీన అంశాలు అన్ని రకాల పోటీ పరీక్షల్లో కీలక పాత్ర పోషిస్తున్నందున ప్రతిరోజూ దినపత్రికలు చదివి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. పత్రికా పఠనాన్ని రోజువారీ చదువులో ఒక భాగంగా చేసుకోవాలని అన్నారు.

ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల సన్నద్ధతను మరింత మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని డిజిటల్ గ్రంథాలయ సదుపాయాలను కూడా పరిశీలించారు. డిజిటల్ వనరులు, ఆన్‌లైన్ అధ్యయన సామగ్రి, పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని యువత ఎలా వినియోగించుకుంటున్నారో తెలుసుకున్నారు. పుస్తకాలతో పాటు డిజిటల్ వనరులను ఉపయోగించుకోవడం ద్వారా జ్ఞానాన్ని మరింత విస్తరించుకోవచ్చని తెలిపారు. అయితే సామాజిక మాధ్యమాల్లో సమయాన్ని వృథా చేయకుండా సాంకేతికతను లక్ష్య సాధనకు వినియోగించుకోవాలని సూచించారు.

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ముందుగా తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకోవాలని కలెక్టర్ అన్నారు. ఒక నిర్దిష్ట ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకుని సంబంధిత పరీక్ష సిలబస్, పరీక్ష విధానం, గత ప్రశ్నపత్రాలను పూర్తిగా అధ్యయనం చేయాలని సూచించారు. ప్రతిరోజూ పునశ్చరణకు సమయం కేటాయించడంతో పాటు, వారానికి ఒకసారి తమ ప్రగతిని స్వయంగా సమీక్షించుకోవాలని తెలిపారు.

ఉద్యోగ నియామక పరీక్షల్లో విజయం సాధించాలంటే కేవలం పుస్తకాలు చదవడం మాత్రమే కాకుండా క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన అవసరమని అన్నారు. నిర్ణీత సమయపట్టిక రూపొందించుకుని దానికి అనుగుణంగా చదువుకోవాలని, మాక్ టెస్టులు రాయడం, గత ప్రశ్నపత్రాలను సాధన చేయడం, నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకోవడం ద్వారా పరీక్షలపై మరింత పట్టు సాధించవచ్చని తెలిపారు.

జిల్లా గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. చరిత్రకు సంబంధించిన 18,108 పుస్తకాలు, తెలుగు భాషలో 9,768 పుస్తకాలు, ఆంగ్లంలో 3,632 పుస్తకాలు, హిందీలో 2,874 పుస్తకాలు, ఉర్దూ భాషలో 1,726 పుస్తకాలు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా వివిధ ఉద్యోగ నియామక నోటిఫికేషన్లకు అనుగుణంగా, పోటీ పరీక్షలకు అవసరమైన తాజా సమాచారంతో కూడిన 2,907 పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.

గ్రంథాలయంలో పుస్తకాల నిల్వలు, పఠన సదుపాయాలు, దినపత్రికల లభ్యత, డిజిటల్ సేవలు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. యువతకు అవసరమైన పుస్తకాలు, సమాచార వనరులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి యువతీ యువకుడిలో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని సరైన దిశలో వినియోగించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడుతున్న యువతకు గ్రంథాలయం ఒక మంచి అధ్యయన కేంద్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, గ్రంథాలయ సెక్రటరీ వెంకటలై,గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం ప్రతాప్, లైబ్రరీయన్ ఆర్.పరమేశ్వరి, గ్రంధాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# విగ్రహం కంటే పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి నేటి యువతకు అవసరం

### బీజేపీ నాయకులు పాలకూరి రవి గౌడ్



**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య )**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక విగ్రహంగా నిలిచిపోవాల్సిన చరిత్రపురుషుడు కాదు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం, అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడిన వీరుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడం గౌరవమే కావచ్చు. కానీ ఒక ప్రశ్న మాత్రం సమాజం ముందుంది. ఆయన విగ్రహం నెలకొల్పడం వల్ల ఎవరికి ప్రయోజనం?ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వల్ల సమాజానికి ఎంత ప్రయోజనం ? సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తన విగ్రహాలను ఏర్పాటు చేయించుకోవడం కోసం పోరాటం చేయలేదు. తన పేరు చరిత్రలో నిలిచిపోవాలని మాత్రమే ఆయన పోరాడలేదు. తన కాలంలో ప్రజలు ఎదుర్కొన్న అన్యాయం, అణచివేత, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజల్లో ధైర్యాన్ని నింపడం కోసం ఆయన పోరాటం సాగించారు. అందుకే నేడు ఆయన విగ్రహాలు ఎన్ని ఏర్పాటు చేశామన్నది కంటే, ఆయన చూపిన పోరాట మార్గాన్ని ఎంతవరకు ఆచరిస్తున్నామన్నదే అసలు ప్రశ్న. బడుగు, బలహీన వర్గాలపై వివక్ష, దాడులు, అణచివేతలు, అన్యాయాలు జరుగుతున్నప్పుడు కేవలం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం వల్ల సమస్యలు పరిష్కారం కావు. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం, సమానత్వం, న్యాయం లభించేలా పోరాడే చైతన్యం రావాలి.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను నేటి యువత చదవాలి. ఆయన ధైర్యాన్ని, నాయకత్వ లక్షణాలను, ప్రజలను ఏకం చేసిన తీరును ఆదర్శంగా తీసుకోవాలి. అన్యాయం ఎదురైతే ప్రశ్నించాలి.. అణచివేత ఎదురైతే ధైర్యంగా నిలబడాలి.. బలహీనులపై దాడి జరిగితే వారి పక్షాన నిలవాలి. ఇదే పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తికి నిజమైన నివాళి. ట్యాంక్‌బండ్ పై విగ్రహం ఏర్పాటుతో ఒక చారిత్రక వ్యక్తికి గుర్తింపు రావచ్చు. కానీ ఆ విగ్రహం చూసిన ప్రతి యువకుడిలో "అన్యాయాన్ని ప్రశ్నించాలి, సమాజం కోసం నిలబడాలి" అనే ఆలోచన కలిగితేనే ఆ విగ్రహం ఉద్దేశ్యం సార్థకమవుతుంది. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు పరిమితం కాకుండా ఆయన చరిత్రను పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, సామాజిక వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. ఆయన పోరాట చరిత్రను భావితరాలకు అందించాలి. విగ్రహాలు నిర్మించడం చరిత్రకు గుర్తు. ఆశయాలను ఆచరించడం చరిత్రకు నిజమైన గౌరవం. పాపన్న గౌడ్ విగ్రహం ప్రతి ఒక్కరినీ ప్రశ్నించాలి "అన్యాయం జరుగుతున్నప్పుడు నువ్వు ఏం చేస్తున్నావు?" ఆ ప్రశ్నకు సమాజం ఇచ్చే సమాధానమే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కి అసలైన నివాళి.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### సిహెచ్ లక్ష్మీనారాయణ

**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య )**

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి సిహెచ్ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నల్లగొండ ఎంపీడీవో కార్యాలయం వద్ద కార్మికుల తో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీ ఓ ఇస్మాయిల్ కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం గ్రామ పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని అన్నారు కార్మికుల ప్రాణాలను హరిస్తున్న జీవో నెంబర్ 51 ని సరిచేసి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి కార్మికుడికి పోస్టల్ ఇన్సూరెన్స్ గ్రామపంచాయతీ నుండి చేయాలని గ్రామపంచాయతీ కార్మికులకు మరణించినట్లయితే మట్టి ఖర్చులకు 30 వేల రూపాయలు గ్రామపంచాయతీ నుండి ఇవ్వాలని, ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో కార్యదర్శులు సర్పంచ్ల వేధింపులు అధికమవుతున్నాయని అన్నారు. వెంటనే కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన బిల్ కలెక్టర్ కారోబార్ లను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని. కార్మికులకు



రావాల్సిన సబ్బులు, బట్టలు, నూనె, చెప్పులు తదితర వస్తువులను వెంటనే ఇప్పించాలని అన్నారు. ఇటీవల కాలంలో కార్మికులపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ల వేధింపులు అధికమవుతున్నాయని కార్మికులపై కక్ష సాధింపు చేయకూడదని హితువు పలికారు. కార్మికులకు కనీస వేతనం 26,000 నిర్ణయించాలని. రెండవ పిఆర్సి లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 24, 25 తేదీలలో కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని. అప్పటికి సమస్య పరిష్కరించకపోతే చలో హైదరాబాద్ నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ, యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు వడ్డేపల్లి యాదయ్య, దున్న అనిల్ కుమార్, ఇరిగి ఎల్లేష్, సింగపంగా లింగమ్మ, ఏనుగు వాణి,శంకర్, ముత్తయ్య, భద్రయ్య, లింగయ్య,రాంబాబు,మల్లేష్, సైదమ్మ, రేణుక, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారికి వినతి

**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య )**

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అర్హత లేని వ్యక్తులకు డబ్బులు తీసుకుని దివ్యాంగుల ధృవీకరణ పత్రాలు జారీ చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్ రమావత్జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నల్లగొండ జిల్లా వ్యాప్తంగా దివ్యాంగుల ధృవీకరణ పత్రాల జారీ విషయంలో తీవ్రమైన ఆరోపణలు,అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్హత లేని వ్యక్తులకు డబ్బులు తీసుకుని దివ్యాంగుల ధృవీకరణ పత్రాలు జారీ చేస్తున్నారనే సమాచారం మా దృష్టికి వచ్చిందని. ముఖ్యంగా ఒక్కొక్కరి వద్ద సుమారు రూ.40,000/- వరకు డబ్బులు తీసుకుని దివ్యాంగుల సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత ఉందో మీ శాఖ ద్వారా సమగ్రంగా విచారణ జరిపి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన కోరారు. అర్హత లేని వ్యక్తులు నకిలీ లేదా తప్పుడు దివ్యాంగుల సర్టిఫికెట్లు పొందితే, వాటి ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు మరియు ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. దీనివల్ల నిజమైన దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందని. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా గతంలో జారీ చేసిన అనుమానాస్పద దివ్యాంగుల ధృవీకరణ పత్రాలపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని అన్నారు.

**ప్రత్యేక కమిటీ ద్వారా ఈ అంశాలను పరిశీలించాలి**

1. ప్రతి అనుమానాస్పద సర్టిఫికెట్‌ను పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ చేయాలి.
2. సంబంధిత అభ్యర్థిని ప్రత్యక్షంగా వైద్య పరీక్షలకు హాజరుపరచాలి.
3. అభ్యర్థి వాస్తవంగా దివ్యాంగుడా? కాదా? అనేది వైద్యపరంగా నిర్ధారించాలి.



4. దివ్యాంగత్వం ఏ రకానికి చెందినది, నిబంధనల ప్రకారం ఎంత శాతం వైకల్యం ఉందో పరిశీలించాలి.
5. సర్టిఫికెట్ జారీ సమయంలో నిజంగా వైద్య పరీక్షలు నిర్వహించారా లేదా పరిశీలించాలి.
6. సర్టిఫికెట్‌లోని వివరాలను సంబంధిత వైద్య రికార్డులతో సరిపోల్చాలి.
7. సర్టిఫికెట్ జారీ ప్రక్రియలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై కూడా విచారణ చేయాలి.
8. అవసరమైతే సర్టిఫికెట్ జారీకి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు మరియు ఇతర ఆధారాలను పరిశీలించాలి.

ఒకవేళ విచారణలో నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు, నిబంధనలకు విరుద్ధంగా ధృవీకరణ పత్రాలు ఇచ్చినట్లు లేదా డబ్బులు తీసుకుని అక్రమంగా సర్టిఫికెట్లు జారీ చేసినట్లు ఆధారాలు లభిస్తే, సంబంధిత వ్యక్తులు, సిబ్బంది లేదా అధికారులు ఎవరైనా సరే వారిపై చట్టపరమైన మరియు శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా, నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా ఇప్పటికే ప్రభుత్వ ప్రయోజనాలు పొందిన వ్యక్తులు ఉన్నట్లయితే, వారి అర్హతను కూడా పునఃపరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలి. నిజమైన దివ్యాంగుల హక్కులు కాపాడబడేలా, అర్హులైన వారికి మాత్రమే ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని సమగ్ర విచారణకు ఆదేశించి, విచారణ నివేదికను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు

# సాక్షి భజరంగ్ కు ఘనంగా సన్మానం

**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య )**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన పోటీలలో రెండు అవార్డులు సాధించిన సాక్షి సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కంది భజరంగ్ ప్రసాద్ ను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఘనంగా సన్మానించి అభినందించారు.

**మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ప్రశంసలు**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలలో అవార్డులు పొందిన సాక్షి సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కంది భజరంగ్ ప్రసాద్ ను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి



ప్రశంసించారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా చర్యలు చేపట్టాలి

**నాగర్‌కర్నూల్ ఆగస్టు 19 (వార్త వేదిక సూర్య ) :**

నాగర్‌కర్నూల్ జిల్లాను సందర్శించిన జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు కే. సురేంద్రమోహన్ ముందుగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌తో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, ఓటర్ల వివరాల పరిశీలన, క్షేత్రస్థాయిలో సేకరిస్తున్న సమాచారం, ఓటర్ల జాబితాకు సంబంధించిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తదితర అంశాలపై పరిశీలకుడు రాజకీయ పార్టీల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను పరిశీలకుడికి వివరించారు. జిల్లాలోని సంబంధిత నియోజకవర్గాల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో అధికారుల ద్వారా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా పరిశీలన, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం తదితర అంశాలను పరిశీలకుడికి వివరించారు.

ఈ సందర్భంగా కే. సురేంద్రమోహన్ మాట్లాడుతూ...., ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, కచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, అర్హులైన ప్రతి ఓటరుకు హక్కు కల్పించే విధంగా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజలకు ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం ఎన్నికల యంత్రాంగం ప్రధాన బాధ్యత అని పరిశీలకుడు తెలిపారు.

ఓటర్ జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా ఓటర్ జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనులందరికీ ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో నివసించే చెంచు కుటుంబాలను గుర్తించి, ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి వివరాలను సేకరించి, వారి పేర్లు ఓటర్ జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఓటర్ నమోదు ప్రక్రియలో చెంచు గిరిజనులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన సహకారం అందించాలని కోరారు.

నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న అర్హులైన చెంచు గిరిజనులందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా, వారు ఓటు హక్కును సులభంగా వినియోగించుకునేలా వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో నివసించే చెంచు గిరిజనులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కోకుండా, వారి నివాస ప్రాంతాలు, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అందుబాటులో ఉండే ప్రదేశాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల నుంచి వచ్చే క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి, సంబంధిత ఆధారాలను పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయం తీసుకోవాలని కే. సురేంద్రమోహన్ సూచించారు. ఏ ఒక్క అర్హుడైన ఓటరుకు అన్యాయం జరగకుండా, అదే సమయంలో అనర్హుల పేర్లు జాబితాలో కొనసాగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని, ప్రతి దశలోనూ అవసరమైన పర్యవేక్షణ చేపడుతున్నామని, ఓటర్ల జాబితా సవరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు ఓటర్ జాబితా సవరణలకు సంబంధించిన దరఖాస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లు, చిరునామా, వయస్సు తదితర వివరాలను ఓటర్ జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సవరణలు, మార్పులు, చేర్పులు లేదా తొలగింపులకు సంబంధించి నిర్ణీత దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా సవరణల ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సైతం ఓటర్ జాబితా సవరణలు, దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని ఓటర్ల జాబితాను పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన సూచనలు, అభ్యంతరాలను అధికారులకు అందించాలని కోరారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి వచ్చే ప్రతి అభ్యంతరాన్ని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

జిల్లాలోని బీఎల్‌వోలు, బీఎల్ఏలతో మండల స్థాయిలో ప్రత్యేక సమావేశాలను నిర్వహించి, ఓటర్ జాబితా సవరణలు, దరఖాస్తుల స్వీకరణ, ఓటర్ల నమోదు ప్రక్రియపై మరింత విస్తృతంగా అవగాహన కల్పించాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధు కోరారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్పందిస్తూ.. రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోలు, బూత్ స్థాయి అధికారులతో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై బీఎల్‌వోలు, బీఎల్ఏలకు స్పష్టమైన అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో నమోదయ్యేలా సమన్వయంతో పనిచేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి చెన్నయ్య, ఆర్డీవోలు, బన్సీలాల్, అర్చన, యాదగిరి, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బాలకృష్ణ, హబీబ్, రాజేందర్, ఎండి హుస్సేన్, నరసింహ విష్ణు, నాగేందర్ గౌడ్, రామకృష్ణ ఎన్నికల సూపరింటెండెంట్ రవికుమార్, డిటి కల్పన పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 92
గురువారం
20 ఆగష్టు 2026



## సర్పంచ్ నుంచి ఎమ్మెల్సీ వైపు..

### రంజిత్ కుమార్ గౌడ్ తదుపరి అడుగు ఎటు..?

మహబూబ్ నగర్ బ్యూరో్,, ఆగస్టు 19 (వార్త వేదిక సూర్య ):

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. మంత్రుల వద్ద కీలక బాధ్యతలు.. ఆరోగ్య రంగంలో పరిపాలనా అనుభవం.. కాలనీ అభివృద్ధి.. ఆ తర్వాత సొంత గ్రామ ప్రజల కోసం ఉద్యోగాన్నే వదిలి సర్పంచ్‌గా రాజకీయాల్లోకి అడుగుపెట్టడం.. ఇలా విభిన్న అనుభవాలతో ముందుకు సాగుతున్న యన్మనగండ్ల సర్పంచ్ ఎం. రంజిత్ కుమార్ గౌడ్ ఇప్పుడు మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారా? రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచనలో ఉన్నారా? అనే చర్చ ప్రస్తుతం నవాబుపేట రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై రంజిత్ కుమార్ గౌడ్ తన సన్నిహితులు, మద్దతుదారులు, విద్యావంతులు, శ్రేయోభిలాషులతో చర్చిస్తున్నట్లు సమాచారం. రాజకీయంగా ముందుకు వెళ్లాలా? పోటీ చేస్తే ఎలాంటి స్పందన ఉంటుంది? ప్రజల మద్దతు ఏ స్థాయిలో లభిస్తుంది? అనే అంశాలపై అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోటీపై ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకోలేదని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**టెకీ నుంచి ప్రజా సేవకుడిగా..**

యన్మనగండ్లకు చెందిన రంజిత్ కుమార్ గౌడ్ ఎంసీ ఏ పూర్తి చేసి ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. మంచి ఉద్యోగ భవిష్యత్తు ఉన్నప్పటికీ ప్రజలకు సేవ చేయాలనే ఆసక్తితో క్రమంగా ప్రజాజీవితం వైపు అడుగులు వేశారు.

2014లో అప్పటి జడ్చర్ల ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశారు. అనంతరం మాజీ మంత్రి ఈటల రాజేందర్ వద్ద కూడా పీఏగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సమయంలో వైద్య సహాయం కోసం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం పొందే ప్రక్రియలో పలువురికి సహకరించినట్లు ఆయన వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఆరోగ్య రంగంలో పరిపాలనా అనుభవం..**

తదుపరి నేషనల్ హెల్త్ మిషన్‌లో రంగారెడ్డి జిల్లా కో–ఆర్డినేటర్‌గా పనిచేశారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలు, అధికారులతో సమన్వయం, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడంలో ఈ బాధ్యత ఆయనకు అనుభవాన్ని అందించింది.

అదే సమయంలో శ్రీశ్రీ హోమ్స్ కాలనీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి తాగునీరు, డ్రైనేజీ, పార్కులు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

**గ్రామం కోసం ఉద్యోగానికి గుడ్‌బై...**

2025లో సర్పంచ్ ఎన్నికల సమయంలో రంజిత్ కుమార్ గౌడ్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి యన్మనగండ్ల సర్పంచ్‌గా పోటీ చేశారు. ఎన్నికల్లో విజయం సాధించి బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించారు.

రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులతో పాటు అవసరమైన చోట సొంత నిధులతో పనులు చేపడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వారపు సంత కొనసాగింపు, గ్రామాన్ని మద్యరహితంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు చేస్తున్న కార్యక్రమాలు కూడా ఆయనకు గుర్తింపు తెచ్చాయని అనుచరులు పేర్కొంటున్నారు.

**రైతుల తరపున గళం..**

పాలమూరు––రంగారెడ్డి ప్రాజెక్టు కాలువ నిర్మాణంతో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలపైనా ఆయన దృష్టి సారించారు. రైతులను సమన్వయం చేసి అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.40 లక్షల పరిహారం, బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్న డిమాండ్లను ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

**గ్రామం దాటి.. గ్రాడ్యుయేట్ల వైపు..?**

ప్రస్తుతం రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న రంజిత్ కుమార్ గౌడ్‌కు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ సమస్యలపై పరిచయం పెరిగింది. దీంతో గ్రామస్థాయి ప్రజా సేవను మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం అంత సులభమైన నిర్ణయం కాదు. వ్యక్తిగత బలం, విద్యావంతులు––ఉద్యోగ వర్గాల్లో పరిచయాలు, రాజకీయ మద్దతు, ఎన్నికల వ్యూహం వంటి అనేక అంశాలు కీలకం కానున్నాయి. అందుకే రంజిత్ కుమార్ గౌడ్ ముందుగా తనకు దగ్గరగా ఉన్న వర్గాల అభిప్రాయాలను తెలుసుకుంటున్నట్లు సమాచారం.

**పార్టీ మద్దతా.. స్వతంత్ర బరిలోనా?**

రంజిత్ కుమార్ గౌడ్‌కు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయని ఆయన అనుచరులు చెబుతున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తే ఏదైనా రాజకీయ పార్టీ నుంచి అవకాశం కోరుతారా? లేక స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా? అనే చర్చ కూడా మొదలైంది.

అయితే ఇవన్నీ ప్రస్తుతానికి రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలే. ఆయన నుంచి ఎమ్మెల్సీ పోటీపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**తదుపరి అడుగు ఎటు..?**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి మంత్రుల కార్యాలయాల వరకు.. ఆరోగ్య రంగం నుంచి గ్రామ పాలన వరకు.. చివరకు ప్రజల కోసం ఉద్యోగాన్ని సైతం వదిలి సర్పంచ్‌గా మారిన రంజిత్ కుమార్ గౌడ్ రాజకీయ ప్రయాణం ఇప్పుడు మరో మలుపు తిరిగే అవకాశాలపై చర్చ సాగుతోంది.

గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతూ మరింత ప్రజా సేవ చేయడమేనా..? లేక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా విస్తృత రాజకీయ వేదికపైకి అడుగుపెట్టడమేనా..? అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఆయన నిర్ణయం ఎలా ఉండబోతుందన్న ఆసక్తి ప్రస్తుతం నవాబుపేటతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

# తులసీదాస్ సాహిత్యం నైతిక విలువలకు నిధి




మహబూబ్‌నగర్ బ్యూరో, జడ్చర్ల, ఆగస్టు 19 (వార్త వేదిక సూర్య ):

జడ్చర్లలోని డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో భక్త కవి గోస్వామి తులసీదాస్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సుకన్య హాజరై తులసీదాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తులసీదాస్ సాహిత్యం, ముఖ్యంగా శ్రీ రామచరితమానస్, నైతిక విలువలకు నిధి వంటిదని అన్నారు. భారతీయ సాహిత్యంలో తులసీదాస్ అమర కవిగా నిలిచారని, రామచరితమానస్ ద్వారా సద్గుణాలు, ఆదర్శవంతమైన జీవన విధానాన్ని ప్రజలకు పరిచయం చేశారని పేర్కొన్నారు. నేటి సమాజం ఆయన ప్రతిపాదించిన ఆదర్శాలను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు.

హిందీ విభాగాధిపతి డాక్టర్ నరసింహారావు కళ్యాణి మాట్లాడుతూ తులసీదాస్ జీవితం, రచనల విశిష్టతను వివరించారు. సాధారణ స్థాయి నుంచి అసాధారణ స్థాయికి ఎదిగిన తులసీదాస్, రామచరితమానస్ ద్వారా ఆదర్శవంతమైన జీవితాన్ని సమాజానికి పరిచయం చేశారని తెలిపారు. విదేశాలకు వలస వెళ్లిన భారతీయులు రామచరితమానస్‌ను భారతీయ సంస్కృతికి ప్రతీకగా తమతో తీసుకెళ్లారని, సురినామ్, ట్రినిడాడ్ తదితర దేశాల్లో దీనికి ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాల తెలుగు విభాగాధిపతి, సహాయ ఆచార్యులు డాక్టర్ సి. నరసింహులు మాట్లాడుతూ తులసీదాస్ రచనల ద్వారా శ్రీరాముని కథ గ్రామీణ ప్రజలకు సులభంగా చేరువైందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, హిందీ విభాగ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నర్సింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన..



### 18 నెలల్లో అందుబాటులోకి నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, హాస్టల్...

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 19(వార్త వేదిక సూర్య ):

మహబూబ్‌నగర్ తిరుమల హిల్స్ సమీపంలోని మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో నిర్మించనున్న నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, హాస్టల్ భవన నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సింగ్ కళాశాల, హాస్టల్ నిర్మాణాన్ని రాబోయే 18 నెలల్లో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ నిర్మాణం మహబూబ్‌నగర్ వైద్య విద్యారంగంలో మరో మైలురాయిగా నిలుస్తుందని మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ పేర్కొన్నారు. నూతన కళాశాల ద్వారా విద్యార్థులతో పాటు స్థానిక యువతకు విద్యా, ఉపాధి



అవకాశాలు మరింత మెరుగుపడతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ లలిత భానుచందర్, నాయకులు మైత్రి యాదయ్య, వాల్డాస్ ప్రతాప్ గౌడ్, జేసీఆర్, శ్రీశైలం, గ్యాస్ అంజి, గోపాల్ మెడికల్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రమేష్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. రాగిణి తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ పాఠశాల విషయంలో డీకే అరుణమ్మపై ఆరోపణలు సరికాదు

### బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి..

మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 19 (వార్త వేదిక సూర్య):

నర్వ మండల కేంద్రానికి నవోదయ పాఠశాల మంజూరు విషయంలో పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ అడ్డుపడుతున్నారంటూ మంత్రి వాకిటి శ్రీహరి చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అపరిపక్వతకు, చేతగానితనానికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి విమర్శించారు.

నర్వ మండల కేంద్రంలో మంత్రి పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన.. నవోదయ పాఠశాల విషయంలో అరుణమ్మ ఎవరిని కలిసి అడ్డుకున్నారో, అందుకు సంబంధించిన ఆధారాలు ఉంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. నర్వ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎంపీకి ముందస్తు సమాచారం ఇవ్వకుండా భూమిపూజలు చేస్తున్న మంత్రి.. ఆమెపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చిట్టెం నర్సిరెడ్డి కుటుంబం, డీకే అరుణమ్మ ఆశీస్సులతో రాజకీయంగా ఎదిగిన శ్రీహరి.. ప్రస్తుతం అదే కుటుంబంపై విమర్శలు చేయడం విజ్ఞతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు.

ఎన్నికల ముందు నర్వ సింగిల్ విండోను ప్రక్షాళన చేసి రైతులకు న్యాయం చేస్తానని ఇచ్చిన హామీని మంత్రి నెరవేర్చలేదని లక్ష్మీకాంత్ రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యేగా రెండేళ్లు, మంత్రిగా ఏడాది పూర్తవుతున్నా సింగిల్ విండో వ్యవహారంపై స్పష్టమైన చర్యలు తీసుకోలేదన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చినట్లు నిరూపించాలి..

మంత్రి తన పర్యటనల్లో ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం కంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చినట్లు ప్రజలకు వివరించాలని లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. మహిళలకు రూ.4 వేల పింఛన్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, డిగ్రీ చదివిన యువతులకు స్కూటీలు, రైతు భరోసా, పేదలకు భూమి, నర్వకు ఇంటర్మీడియట్ కళాశాల, 100 పడకల ఆసుపత్రి, నర్వ––రాంపూర్ గేట్ డబుల్ రోడ్డు వంటి హామీల అమలుపై మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ ఎన్నికల ముందు ఆత్మకూర్, అమరచింత మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపనలు చేసినప్పటికీ, ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా వాటిలో ఎన్ని పనులు పూర్తయ్యాయో వెల్లడించాలని కోరారు.

మక్తల్––నారాయణపేట రహదారితో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటిపై దృష్టి సారించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని మంత్రి శ్రీహరికి సూచించారు. కేబినెట్ మంత్రిగా హుందాతనంతో వ్యవహరించి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి కోరారు.

## మహబూబ్‌నగర్



### ప్రతి కుటుంబ ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇల్లు...

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి..**

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 19(వార్త వేదిక సూర్య ):



ఇందిరమ్మ ఇల్లు ప్రతి కుటుంబ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

ఎదిరకు చెందిన సుజాత, నరేష్ దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, వారు నూతన గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహప్రవేశాన్ని ప్రారంభించారు. అనంతరం దంపతులకు గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని, తద్వారా వారి జీవితాల్లో సంతోషం, భద్రత, ఆత్మగౌరవం పెరుగుతాయని పేర్కొన్నారు.

అనంతరం సుజాత, నరేష్ దంపతుల కుమార్తెల పుట్టుచీర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బిందుప్రియ, టోనీలను ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ లలిత భానుచందర్, నాయకులు మైత్రి యాదయ్య, వాల్డాస్ ప్రతాప్ గౌడ్, శ్రీశైలం, గ్యాస్ అంజి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### కోయిల్ సాగర్ నుంచి కుడి, ఎడమ కాలువలకు సాగునీటి విడుదల...

మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 19(వార్త వేదిక సూర్య ):





కోయిల్ సాగర్ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా దిగువకు సాగునీటిని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్ ) విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోయిల్ సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.9 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, ఇందులో 0.6 టీఎంసీలను తాగునీటి అవసరాలకు కేటాయించినట్లు తెలిపారు. ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపడంతో పాటు బోర్లు రీచార్జ్ అయ్యేలా మొదటి విడతగా కాలువలకు నీటిని విడుదల చేసినట్లు చెప్పారు.

సాధారణంగా కాలువలకు నీటిని విడుదల చేయాలంటే రిజర్వాయర్‌లో కనీసం 1.5 టీఎంసీల నీరు ఉండాల్సి ఉంటుందని, అయితే ప్రస్తుతం ఉన్న నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతుల ప్రయోజనం కోసం నీటిని విడుదల చేసినట్లు వివరించారు.

నీళ్లు వస్తున్నాయనే ఉద్దేశంతో రైతులు కొత్తగా వరి తుకాలు వేయవద్దని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు.

అదేవిధంగా ఉంద్యాల పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్ల ద్వారా కోయిల్ సాగర్‌కు నీటిని తరలిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల తర్వాత రిజర్వాయర్‌లో నీటి మట్టాన్ని పరిశీలించి, అందుబాటులో ఉన్న నీటి ఆధారంగా సాధ్యమైనంత మేర రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతరం చిన్నచింతకుంట మండలం లాల్‌కోట గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మోత్కూరు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

**- ఎమ్మెల్యే సామేల్**



**మోత్కూరు, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య)** : గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడంతో పాటు మహిళల సంక్షేమం, యువతకు క్రీడా సదుపాయాలు, పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని మినీ స్టేడియంలో రూ.32 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ, రూ.17 లక్షల వ్యయంతో చేపట్టనున్న కార్యాలయ భవనంతోపాటు బృందావన్ కాలువలో కోటి రూపాయలతో చేపట్టనున్న మినీ బ్రిడ్జి నిర్మాణం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు 4.29 ఎకరాల భూమిలో మినీ స్టేడియం లో క్రీడా మైదానం నిర్మిస్తున్నామన్నారు. ఇది క్రీడాకారులకు ఎంతో అవసరమన్నారు. క్రీడా మైదానాల్లో మెరుగైన వసతులు కల్పించి యువత క్రీడల వైపు ఆకర్షితులయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాను 1969 మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుకున్నానని విద్యార్థి దశలో ఉన్న సమయంలో ఈ చెరువు ఎట్లా ఉందో ప్రస్తుతం అలాగే ఉందన్నారు. ఈ చెరువుపై హెచ్ఎండిఏ డిపార్ట్మెంట్ అధికారులకు తెలియజేశానని ఈ చెరువును 60,70 ఏళ్ల నుంచి ఉన్న కల్వర్టు వెడల్పు చేయడం జరుగుతుందన్నారు. శుద్ధికరణ చేసి చేపలు దుర్వినియోగం కాకుండా మత్స్య కార్మికులకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నానన్నారు. రేవంత్ రెడ్డి ప్రజా పరిపాలనలో రాష్ట్రంలో ఏ పథకాన్ని ప్రవేశపెట్టిన మహిళల పేరిట ప్రవేశపెడుతున్నామని, రేషన్ కార్డు నుండి ఉచిత బస్సు వరకు కొనసాగిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన యూపీఏ మాది చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీని అనుసరించి ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందించే క్రమంలో బాగంగా 2024 జులై 14న సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ పంపిణీ శ్రీకారం చుట్టారని తెలిపారు. నేడు రాష్ట్రంలో 1.61 లక్షల మంది రేషన్ కార్డుల లబ్ధిదారులు ఉన్నారని త్వరలో వారికి స్మార్ట్ రేషన్ కార్డులు అందుతాయని తెలిపారు. జామచెట్లబావి నుండి కొండాపురం వరకు మట్టిరోడ్డును త్వరలో బి.టి.పూర్తి చేయనున్నట్లు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మోత్కూరు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి ధ్యేయంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లుగౌడ్, వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి , పిఏసిఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు,ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరి రెడ్డి, కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్య శ్రీనివాస్ రెడ్డి, మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్ గుండగోని రామచంద్రుగౌడ్, ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్ గజ్జి లింగమల్లు గ్రంథాలయం చైర్మన్ కోమటి మత్స్యగిరి మండల పట్టణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ,అన్నెపు పద్మ, స్థానిక నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహ్మారెడ్డి, మందుల సురేష్, బద్దం నాగార్జున రెడ్డి, పల్లపు సమ్మయ్య ఏఈ సరిత రాణి, డి.ఈ.సురేందర్ కుమార్ ఆర్ అండ్ బి ఏ.ఈ మెంట స్వామి సోషల్ మీడియా కన్వీనర్లు పాలోజు శేఖరాచారి,బందెల రవి తదితరులు పాల్గొన్నారు.



# యాదాద్రి భువనగిరి

## తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్




**రామన్నపేట ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య ) :** రామన్నపేట మండలకేంద్రం లో రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఉదయం 11.00.గంటలకు (1) రోజు దీక్ష కార్యక్రమంనిర్వహించి, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకరికంటి రాము గారు మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి పోస్టల్ ఇన్సూరెన్స్ చేయాలి 51 జీవోను రద్దు చేయాలి నాలుగో లేబర్ కోర్టులను రద్దు చేయాలి ఆన్లైన్లో లేనికా కార్మికుల పేర్లు వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలి డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం మండల అభివృద్ధిఅధికారి ఆవుల రాములు ఇవ్వడం జరిగినది.

**డిమాండ్స్** :1. కనీస వేతనం ప్రతి కార్మికునికి 26000 రూ - లు ఇవ్వాలి. 2 . రెండవ్రా=జ ప్రతి కార్మికునికి వర్తించాలి. 3. జి వో నెంబర్ 51 ని సవరించాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల భిక్షం మండల అధ్యక్షులు గాదె ఎల్లయ్య బొడ్డు సాలయ్య దాసు నాగరాజు సాయిలు వీరేశం బచ్చులింగస్వామి గడ్డం ఎల్లయ్య నల్ల సుగుణమ్మ చిత్రకంటి శోభ భారతమ్మ కవిత ప్రమీల మంగమ్మ జయమ్మ ,తదితరులు పాల్గొనడం జరిగినది

## ఫోటో రంగంలో అభివృద్ధి చెందాలి



**మోత్కూరు, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య):** దేశంలో టెక్నాలజీ మారుతుందని, దానిని అందిపుచ్చుకొని టెక్నాలజీ ఏఐని ఫోటోగ్రఫీ రంగంలో మరింత అభివృద్ధి చెందాలని మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు కోమటి జనార్దన్ కోరారు. ఫోటోగ్రఫీ" డే"ని పురస్కరించుకొని బుధవారం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ పితామహుడు డాగురే చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక శ్రీకాంత్ చౌరస్తా వద్ద ఫోటోగ్రఫీ జెండాను జనార్ధన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి అమరావతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు యండి అస్లాం, కోశాధికారి ఎండి సాజిత్, సహాయ కార్యదర్శి గుండు మహేష్, భరోసా మండల అధ్యక్షులు ఉప్పల రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు పెండెం మహేష్, పులకరపు వేణు, చేపూరి అనిల్, గుడిశాల రమేష్, ఎం.డి.జక్కి మాజీ అధ్యక్షులు గుండు శ్రీను, చీమల వీరస్వామి, స్థానిక నాయకులు ఎండి జలాల్, పందుల ప్రవీణ్, ఎడ్ల ప్రవీణ్ కూరెళ్ళ విష్ణు, కోరెల రాజశేఖర్ పెద్దిసాయి, బూడిద మహేష్, జటంగి ప్రవీణ్ భాస్కర్, నజీర్, సైదులు శేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో ఫోటోగ్రఫీ వేడుకలు



**యాదగిరిగుట్ట ఆగస్టు 19 (వార్త వేదిక సూర్య) :** యాదగిరిగుట్ట మండల కేంద్రంలో బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీడే ను యాదగిరిగుట్ట మండల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్, ప్రపంచ ఫోటోగ్రఫీ డే ను ఘనంగా నిర్వహించారు. ఫోటోగ్రఫీ అభివృద్ధికి విశేష కృషి చేసిన లూయిస్ డాగురె జయంతిని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాగురె చిత్రపటానికి ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు మాట్లాడుతూ, కాలంతో పాటు ఫోటోగ్రఫీ రంగంలో ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ, ఫోటోగ్రఫీని వృత్తిగా నమ్ముకుని జీవిస్తున్న వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ముడి సరుకుల ధరలు పెరగడంతో ఫోటోగ్రఫీ రంగంపై ఆర్థిక భారం పెరిగిందన్నారు.

అదేవిధంగా సెల్ఫోన్లు, సోషల్ మీడియా విస్తృతంగా అందుబాటులోకి రావడంతో వృత్తిపరమైన ఫోటోగ్రాఫర్లకు అవకాశాలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వివాహాలు, శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు, వార్తా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఫోటోగ్రాఫర్లను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు.

ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు, వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో మండల ఫోటోగ్రాఫర్ అధ్యక్షుడు కర్రె శ్యామ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కనకాల ప్రభాకర్, కోశాధికారి కందోజు కిరణ్ చారి, జిల్లా పిఆర్ఓ బేతి రవికుమార్, కార్యవర్గ సభ్యులు గడ్డమీది సంతోష్ గౌడ్, నాగేష్, గుండె శివకుమార్, చిట్యాల రాజు, స్వర్గం శివ, సుక్కల రాజు, సురేష్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## మోటకొండూరులో రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ

**- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**



**మోటకొండూరు, ఆగస్టు 19(వార్త వేదిక సూర్య):-** మోటకొండూరు మండల కేంద్రంలో (గురువారం, 20వ తేదీ) స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య హాజరుకానున్నారు. గురువారం మధ్యాహ్నం సరిగ్గా 12 గంటలకు ఆయన చేతుల మీదుగా ఈ విగ్రహావిష్కరణ ఘనంగా జరగనుందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

**భారీ ఎత్తున తరలిరావాలని పిలుపు**

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని రఘునాథ రాజు పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలన్నారు. అలాగే గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు, మహిళా సంఘాల నాయకులు, వివిధ అనుబంధ సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు సకాలంలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# 31న చలో ఇందిరాపార్క్ మహాధర్నాను జయప్రదం చేయండి

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి.జహంగీర్**




**వలిగొండ: ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య)**

యాదాద్రి భువనగిరి జిల్లా పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకై డిమాండ్ చేస్తూ ఆగస్టు 29,30,31 తేదీల్లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని 29 న, భువనగిరి అంబేద్కర్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై 31న ఇందిరా పార్క్ కు చేరుకొని మహా ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని 31న జరిగే చలో హైదరాబాద్ ఇందిరా పార్క్ మహాధర్నాను వేలాదిగా రైతులు,ప్రజలుపాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్ పిలుపునిచ్చారు. బుధవారం రోజున వలిగొండ మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శిలు, ప్రజా సంఘాల మండల అధ్యక్ష కార్యదర్శుల సమావేశం జరిగింది. అనంతరం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భువనగిరి జిల్లా నూతనంగా ఏర్పడి దశాబ్దం అవుతున్నప్పటికీ జిల్లాలో ఎంతవరకు ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు పురోగతి సాధించ లేదన్నారు.

జిల్లాకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉండి లక్షలాది మంది చిన్న సన్నకారు మధ్యతరగతి రైతాంగం ఆధారపడి తమ కుటుంబాలను గడుపుతున్నారన్నారు ఇక్కడి ప్రజలకు గత్యంతరం లేక విషాన్ని వెదజల్లుతున్న మూసీ పై ఆధారపడి అనేక రోగాలకు గురవుతున్నారని ప్రజల గోడును ప్రజల ఆరోగ్యాలను పట్టించుకునే పరిస్థితిలో లేని పాలకులు తమ చేతగానితనాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

**అరకొరకు నిధులు అత్తెసరు**

ఈ సమావేశం కందడి సత్తిరెడ్డి అధ్యక్షతన జరగగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు మొగిలిపాక గోపాల్, చీర్క శ్రీశైలం రెడ్డి,కర్ణకంటి యాదయ్య,దుబ్బ లింగం, భీమనబోయిన జంగయ్య, శాఖ కార్యదర్శిలు ప్రజా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు దయ్యాల మల్లేశం,చేగూరి నగేష్, దొడ్డి బిక్షపతి,రాధారపు మల్లేశం, కర్నాటి మత్స్యరాణి, శీలం ఇందిర,కొండూరు సత్తయ్య, ఉండ్రాటి పాపయ్య, వేముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్థిక సహాయం అందజేసిన ఏ జే అర్ ఫౌండేషన్



**వలిగొండ: ఆగస్టు 19 ( వార్తావేదిక సూర్య ) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన దొడ్డి ఎంకమ్మ చాలా రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. బుధవారం వారి కుటుంబ సభ్యులకి ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో రూపాయలు 5000/- అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, గ్రామ యువత, ఏజేఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# వెల్లంకిలో బెల్ట్ షాపులు మూసివేయాలని తీర్మానం



**రామన్నపేట ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య)**

గ్రామ ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెల్లంకి గ్రామ పరిధిలో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధించాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజలు, అఖిలపక్ష నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామ సర్పంచ్ ఇడెం రాధ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై చర్చించారు. తీర్మానం మేరకు బుధవారం కలెక్టర్, సంబంధిత జిల్లా ఎక్సైజ్ అధికారులు, మండల ఎక్సైజ్ అధికారులు, రామన్నపేట సీఐ, ఎస్ఐలకు వినతిపత్రాలు అందజేశారు. గ్రామ పరిధిలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సెప్టెంబర్ 1 నుంచి నిషేధం అమలు

సెప్టెంబర్ 1వ తేదీ నుంచి వెల్లంకి గ్రామ పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గ్రామంలో మద్యం విక్రయాలను అరికట్టి యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ పంచాయతీ పాలకవర్గం, ప్రజలు, అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇడెం రాధ శ్రీనివాస్, వార్డు సభ్యులు సండ్ల లింగయ్య, జువ్వగోని మల్లమ్మ, జింక శాంతి, మొగిలి భాగ్యలక్ష్మి, గంజి భాస్కర్, కన్నెబోయిన రాజలింగం, అఖిలపక్ష నాయకులు పర్నే వెంకట్‌రెడ్డి, ఆవనగంటి నగేష్, పున్న వెంకటేశం, కర్రే సంతోష్, బర్ల బాబురావు, నకిరేకంటి మహేష్, తాటిపాముల లింగస్వామి, గూని రాజు, గూడెల్లి దామోదర్, నకిరేకంటి నరేందర్, పాశం సతీష్, నకిరేకంటి గణేష్, గుర్రం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మిక కార్యవర్గానికి సన్మానం



**మోత్కూరు, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య):** ఇటీవల నూతనంగా ఎన్నికైన చేనేత కార్మిక సంఘం కార్యవర్గానికి రహీంఖాన్ పేట చేనేత పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షులు శ్రీదోర్నాల హరీష్, స్థానిక చేనేత సహకార సంఘం అధ్యక్షులు వంగరి రాములు,కోశాధికారి పోచం కన్నయ్య, కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కార్యవర్గం చేనేత కార్మికుల సమస్య పరిష్కారం ఐక్యంగా కృషి చేయాలని కోరారు.



# యాదాద్రి భువనగిరి

# గిరిప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య





**యాదగిరిగుట్ట ఆగష్టు 19 (వార్త వేదిక సూర్య)** : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి స్వాతి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారుల ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలేరు ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.వేకువజామున ఆలయ ముఖ మండపంలో అర్చకులు శతఘటాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ బీర్ల అయి లయ్య , ఆలయ ఈవో భవాని శంకర్ తో కలిసి గిరిప్రదక్షిణను ప్రారంభించారు.స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించిన ఈ గిరిప్రదక్షిణలో వేలాది మంది భక్తులు, భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. భక్తుల ఆధ్యాత్మిక సందడితో యాదగిరిగుట్ట పరిసరాలు మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధి కారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.

## ఎల్ వో సి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**వలిగొండ: ఆగస్టు 19 ( వార్తా వేదిక సూర్య ) :** వలిగొండ మండలం నాతాళ్ళ గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మస్కు బుచ్చయ్య కుమారునికి వారం రోజుల క్రితం నిమ్స్ హాస్పిటల్ హైదరాబాద్ లో సర్జరీ అయినది. ఈ సందర్భంగా బుధవారం భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ ఓ సి బాధిత కుటుంబానికి అందజేశారు .బుచ్చయ్య కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉలిపే మల్లేశం , మాజీ ఎంపీటీసీ ఉద్దగిరీ భాస్కర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మస్కు నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉద్దగిరి శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు కాసుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి



**రామన్నపేట ఆగస్టు 19( వార్తా వేదిక సూర్య ) :** రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన బాలరాజు, రామన్నపేట పట్టణానికి చెందిన చెరుకు సత్యనారాయణ గతంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేశారు. 2006 నుంచి 2019 వరకు విధులు నిర్వహించిన తమను జాబ్‌కార్డుల్లో పనిదినాలు 10 శాతానికి తగ్గిన కారణంగా విధుల నుంచి తొలగించినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం వీబీజీ రామ్‌జీ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా తిరిగి పనిచేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు బుధవారం రామన్నపేట ఎంపీడీవో ఏ. రాములు, ఏపీవో వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. గతంలో సుమారు 13 సంవత్సరాల పాటు అందించిన సేవలు, తమకు ఉన్న అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు అధికారులను విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకం అమలులో తమ అనుభవాన్ని వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు.

## అర్హత కల్గిన ప్రతి చేనేత కార్మికునికి పెన్షన్ మంజూరు చేయాలి

**- చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు**



**మోత్కూరు, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య):** 50 సంవత్సరాలు నిండిన ప్రతి చేనేత కార్మికునికి ఏలాంటి షరతులు లేకుండా పెన్షన్ మంజూరు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మోత్కూరులో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం చేయూత పథకం ద్వారా పెన్షన్ అందించేందుకు దరఖాస్తులకు ఆహ్వానించడం శుభపరిణామన్నారు.తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగంపై అదారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ఏ ఆధారం లేక వృత్తి పరమైన ఇబ్బందుల కారణంగా అనేక మంది నిరుపేద చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అటువంటి అర్హులైన చేనేత కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చేయూత పథకం ద్వారా ఆర్థిక భరోసా అందించాలని కోరారు.

## మహిళలు అభివృద్ధి చెందేలా ప్రభుత్వం నిరంతరం కృషి



**మోత్కూరు, ఆగస్టు 19 ( వార్త వేదిక సూర్య):** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. క్రింద మంజూరైన 10 లక్షల రూపాయల వ్యయంతో మహిళా సంఘ సమాఖ్య నూతన భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, స్వయం ఉపాధి అవకాశాలను తెలుగుపరుస్తామని తెలిపారు. ఈ గ్రామ అభివృద్ధికి ప్రజలంతా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఏలాంటి సమస్యలు నెలకొన్న తమ దృష్టికి నేరుగా తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దత్తప్పగూడెం, అనాజిపురం సర్పంచులు గుండు యాదగిరి గౌడ్, బీసు వెంకటయ్య ఉపసర్పంచ్ ఇటీకాలఎల్లమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లుగౌడ్,పిఎసిఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మోత్కూరు మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్, మండల నాయకులు గుండగోని రామచంద్రుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పర్యటనకు ఏడుగురు కౌన్సిలర్ల డుమ్మా

**మోత్కూరు, ఆగస్టు 19 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అభివృద్ధి కార్యక్రమాలకు డుమ్మా కొట్టారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. స్థానిక అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు మాత్రం కార్యక్రమాలకు దూరంగా ఉండడంతో చర్చనీయాంశంగా మారింది. జిల్లా మాజీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, పైళ్ల సోమిరెడ్డి ఫొటోను కార్యక్రమాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ముద్రించకపోవడంపై అసంతృప్తితోనే తాము ఎమ్మెల్యే కార్యక్రమాలకు హాజరుకాలేదని కౌన్సిలర్లు విలేకరులకు తెలిపారు. సీనియర్ నాయకులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు వారు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే పర్యటనలో అధికార పార్టీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు సామూహికంగా గైర్హాజరు కావడం మోత్కూరు కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత అసంతృప్తికి అద్దం పడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో అంతర్గత విభేదాలు బహిర్గతమైన నేపథ్యంలో మోత్కూరులో చోటుచేసుకున్న ఈ పరిణామం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఎమ్మెల్యే పర్యటనకు కౌన్సిలర్ల గైర్హాజరుపై పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుందో, ఈ అసంతృప్తికి ఎలాంటి పరిష్కారం లభిస్తుందో రాబోయే రోజుల్లో వేచి చూడాల్సిందే.

# రోడ్డు నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

**- కాటేపల్లి 'ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్'లో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు**

**- పాల్గొన్న మోటకొండూరు ఎస్సై కుమారస్వామి, ట్రాఫిక్ సీఐ కృష్ణ**

**మోటకొండూరు, ఆగస్టు 19(వార్త వేధిక సూర్య):-** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచించారు. మోటకొండూరు మండల పరిధిలోని కాటేపల్లిలో ఉన్న ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోటకొండూరు ఎస్సై కుమారస్వామి, యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ కృష్ణ తమ సిబ్బందితో కలిసి హాజరై, కంపెనీ ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ (ముగ్గురు ప్రయాణించడం), సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రాణాపాయమని హెచ్చరించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి (డ్రంక్ అండ్ డ్రైవ్) లేదా అతివేగంగా (రాష్ డ్రైవింగ్) వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తమ వెంట తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కాపీ ,మరియు ఇన్సూరెన్స్ తదితర ధృవీకరణ పత్రాలను ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.




## బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన సర్పంచ్



**ఆత్మకూరు (ఎం), ఆగస్టు 19 (వార్తా వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన శ్యామల భిక్షపతి ఇటీవల అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, గ్రామాభివృద్ధి ప్రదాత, వైయస్సార్ ఫౌండేషన్ అధినేత ఎర్ర సోమిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి మంగళవారం శ్యామల భిక్షపతి నివాసానికి వెళ్లారు.ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలియజేశారు. భిక్షపతి మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, ధైర్యంగా ఉండాలని కోరారు. వారి కుటుంబానికి వైయస్సార్ ఫౌండేషన్ తరఫున తక్షణ ఆర్థిక సహాయంగా పది వేల రూపాయలు నగదును అందజేశారు. భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఇంజమూరి భిక్షపతి, వార్డు సభ్యులు మెట్టు జితేందర్ రెడ్డి, నాయకులు ఎర్ర లింగారెడ్డి, ఎడ్ల యాకూబ్ రెడ్డి, ఎర్ర నరేందర్ రెడ్డి, శ్యామల కిష్టయ్యలతో పాటు భారత రాష్ట్ర సమితి నాయకులు, గ్రామ ప్రముఖులు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**